RNI No : TELTEL/2022/85167

# పద్మక్రాంతి

(వాస్తవాలు వెలుగులోకి)

తెలుగు దినపత్రిక

సంపుటి : 03 | సంచిక : 140 | రంగారెడ్డి | ఎడిటర్ : గంజి వెంకటేష్ | శుక్రవారం, మే 09, 2025 | పేజీలు : 08 | వెల రూ. 3.00/-

VOLUME : 03 | ISSUE : 140 | RANGAREDDY | EDITOR : GANJI VENKATESH | FRIDAY, MAY 09, 2025 | PAGE : 8 | PRICE :3/-

## చర్చల కోసం భారత్, పాక్‌లకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధం

లండన్ : ఉద్రిక్తతలను తగ్గించే దిశగా ముందుకు సాగేందుకు, చర్చల కోసం భారత్, పాకిస్తాన్‌లకు మద్దతు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బ్రిటన్ ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్, పిఒకెలోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం దాడులు చేపట్టిన సంగతి తెలిసిందే. దాడుల తర్వాత బ్రిటన్ కార్యదర్శి మీడియాతో మాట్లాడారు. జమ్ముకాశ్మీర్‌లో పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని వ్యాపార, వాణిజ్య కార్యదర్శి జోనాథన్ రెనాల్డ్స్ పేర్కొన్నారు. తన కేబినెట్ సహచరుడు, విదేశాంగ కార్యదర్శి డేవిడ్ లామీ ఇరుదేశాలతో సంప్రదింపులు జరిపారని అన్నారు. ఇరుదేశాలకు స్నేహితులం, భాగస్వామ్యులం అనేది తమ సందేశమని, ఇరు దేశాలకు మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఇరు దేశాలకు ప్రాంతీయ స్థిరత్వం, చర్చలు, ఉద్రిక్తతలను తగ్గించడంలో ఆసక్తి ఉందని, దానికి మద్దతుగా ఏవిధమైన సాయం అందించేందుకైనా తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

# ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే

ఇది కొనసాగుతుందని ప్రకటించిన కేంద్రం

అఖిలపక్ష భేటీలో వివరాలు వెల్లడించిన రాజ్‌నాథ్

దేశ రక్షణలో రాజీపడబోమని వెల్లడి

సంపూర్ణ మద్దతు ప్రకటించిన విపక్ష నేతలు




2



ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గురువారం ఉదయం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆపరేషన్ సిందూర్ విజయం, పర్యవసానాలను ఆయన వివరించారు. సిందూర్ అనేది కొనసాగుతున్న ఆపరేషన్ అని అన్నారు. భారత్ మరిన్ని దాడులు చేయాల్సిన అవసరం లేదని, కానీ పాక్ దళాలు దాడిచేస్తే తిరిగి ఎదురు దాడి చేస్తామని అన్నారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, ఎస్.జయశంకర్, జె.పి.నడ్డా, నిర్మలా సీతారామన్ ప్రభుత్వం తరపున హాజరవగా, కాంగ్రెస్ నుండి లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, టిఎంసి నుండి సందీప్ బందోపాధ్యాయ, డిఎంకె నుండి టి.ఆర్.బాలులు సమావేశానికి హాజరయ్యారు.

- న్యూఢిల్లీ,మే8(పద్మక్రాంతి)






# పేదల ఇళ్లు కూల్చడం హైడ్రా లక్ష్యం కాదు

హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిందే

చెరువులను కబ్జా చేసిన వారిని వదిలి పెట్టేది లేదు

హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంభంలో సిఎం రేవంత్

**హైదరాబాద్,మే8(పద్మక్రాంతి):**

హైడ్రా అంటే కొందరికి కడుపు మంట అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. అందుకే హైడ్రాపై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా అనేది పేదల ఇళ్లు కూల్చడానికి కాదని.. ఆక్రమణదారులను అడ్డుకోవడానికేనని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మన పూర్వీకులు ఇచ్చిన చెరువులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. చెరువులు కనుమరుగైతే మన మనుగడ ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. 450 ఏళ్ల చరిత్ర

- మిగతా 2లో..

# మెడికల్ కాలేజీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం

వైద్య సేవల కోసం భారీగా నిధుల వెచ్చింపు

ఖమ్మంలో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శంకుస్థాపన

పాల్గొన్న నలుగురు మంత్రులు

2



# శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌శంకుస్థాపన

ఆవిష్కరణలు పెట్టుబడులతో భవిష్యత్‌కు బాటలు

కార్యక్రమంలో మంత్రి లోకేశ్ వెల్లడి

2




# పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ

లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం

పాక్ రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని దాడులు

భారత్‌లో పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులు

సమర్థంగా తిప్పికొట్టిన రోణ దళాలు

ఆయా ప్రాంతాల్లో డ్రోన్ శకలాల సేకరణలో అధికారులు

భారత్ దాడులతో బెంబేలెత్తుతున్న పాక్

2



# తెలంగాణ పర్యాటకానికి పెద్దపీట

అందాల పోటీల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు

ఆయా ప్రాంతాలను సందర్శించేలా కార్యక్రమాలు

వివరాలు 3లో

పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

# కేంద్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో ప్రజలకు చేరాలి

**ఆర్గానిక్. ఫామింగ్, వ్యవసాయ పనిముట్లపై రైతులు మొగ్గు చూపాలి**

**మెదక్ ఎంపీ మాధవినేని రఘునందన్ రావు**





**మెదక్ జిల్లా, మే 8, (పద్మక్రాంతి):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు జిల్లాలో ప్రజలకు చేరువ చేయాలని మెదక్ పార్లమెంటు సభ్యులు మాధవనేని రఘునందన్ రావు అధికారులను ఆదేశించారు. జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిష) సమావేశంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సూచించారు. జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అధ్యక్షతన కలెక్టరేట్ లో సమావేశం జరిగింది. విద్యా, వైద్యం, వ్యవసాయం పరిశ్రమలు, పౌరసరఫరాల, ప్లానింగ్, సంక్షేమ, ఇరిగేషన్, గ్రౌండ్ వాటర్, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే ,గ్రామీణ అభివృద్ధి, శాఖల అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలు క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలపై సుదీర్ఘంగా ఎం.పీ సమీక్షించారు. విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ బాలికల పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మాణం చేసి ఉపయోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సాధించి ప్రత్యేక క్లినిక్ చేయడానికి క్లీనింగ్ యంత్రాన్ని ప్రయోగాత్మకంగా మన జిల్లాకు మంజూరు చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ దిశ సమావేశానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఇంచార్జ్ అదనపు కలెక్టర్ భుజంగరావు, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, ఎఫ్బి ఎం డైరెక్టర్ సురేష్ బాబు పాల్గొన్నారు.

# పాక్ డ్రోన్ దాడులను తిప్పికొట్టిన రక్షణశాఖ

**లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం**

**పాక్ రక్షణ వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని దాడులు**

**భారత్‌లో పలు ప్రాంతాల్లో పాక్ డ్రోన్ దాడులు**

**సమర్థంగా తిప్పికొట్టిన రోణ దళాలు**

**ఆయా ప్రాంతాల్లో డ్రోన్ శకలాల సేకరణలో అధికారులు**

**భారత్ దాడులతో బెంబేలెత్తుతున్న పాక్**

**న్యూఢిల్లీ,మే8(పద్మక్రాంతి):**

భారత్ ప్రతీకార దాడులతో బెంబేలెత్తుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన దాయాదికి చుక్కెదురైంది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని ఆయా ప్రాంతాల్లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. దీంతో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు- భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. చైనాకు చెందిన హెచ్‌క్యూ-9 రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, అదామ్‌పుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, భుజ్ తదితర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు యత్నించింది. అయితే.. వీటిని ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థలతో సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే భారత్ ప్రతీకార దాడులకు దిగింది. పాకిస్థాన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ రాడార్‌లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సైన్యం విరుచుకుపడింది. లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం అయినట్లు- విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో మొర్టార్లు, భారీ ఫిరంగులతో దాడులుచేస్తోంది. వీటిలో ఇప్పటివరకు 16 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుంటే కరాచీ, లాహోర్, సహా ఇతర ప్రధాన నగరాలపై దాడి చేయడానికి భారతదేశం డ్రోన్‌లను ఉపయోగించిందని పాకిస్తాన్ పేర్కొంది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత సాయుధ దళాలు క్షిపణి దాడులు చేసిన ఒక రోజు తర్వాత, లాహోర్, కరాచీలపై భారతదేశం డ్రోన్ దాడులు ప్రారంభించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. ఇలా ఉండగా, భారత్ ఆపరేషన్ సిందూర్ కొనసాగిస్తోంది. పాక్ కు చుక్కలు చూపిస్తోంది. పాక్ దాడులను తిప్పికొడుతూ భారత్ భారీగా ఎదురుదాడులు చేస్తోంది. తాజాగా పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్‌పై భారత్ డ్రోన్ దాడి చేసింది. పాక్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను ధ్వంసం చేసింది. అటు-, రావల్పిండి హెడ్ క్వార్టర్ పైనా భారత్ డ్రోన్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్ మీడియా ముందుకొచ్చి ప్రపంచ దేశాలతో లబోదిబోమంటూ మొరపెట్టుకుంటోంది. లాహోర్, కరాచీ ఇంకా పాకిస్థాన్ లోని ఇతర ప్రదేశాలలో భారత్ వరుస డ్రోన్ దాడులు నిర్వహించిందని పాకిస్తాన్ సైన్యం పేర్కొంది. మరోవైపు, కరాచీ విమానాశ్రయాన్ని సాయంత్రం 6 గంటల వరకు మూసివేసినట్లు- పాకిస్థాన్ ప్రకటించింది.

# ఆపరేషన్ సిందూర్ ఆరంభం మాత్రమే

**న్యూఢిల్లీ,మే8(పద్మక్రాంతి):**

ఆపరేషన్ సిందూర్‌లో వంద మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గురువారం ఉదయం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆపరేషన్ సిందూర్ విజయం, పర్యవసానాలను ఆయన వివరించారు. సిందూర్ అనేది కొనసాగుతున్న ఆపరేషన్ అని అన్నారు. భారత్ మరిన్ని దాడులు చేయాల్సిన అవసరం లేదని, కానీ పాక్ దళాలు దాడిచేస్తే తిరిగి ఎదురు దాడి చేస్తామని అన్నారు. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, ఎస్.జయశంకర్, జె.పి.నడ్డా, నిర్మలా సీతారామన్ ప్రభుత్వం తరపున హాజరవగా, కాంగ్రెస్ నుండి లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, టిఎంసి నుండి సందీప్ బందోపాధ్యాయ, డిఎంకె నుండి టి.ఆర్.బాలులు సమావేశానికి హాజరయ్యారు. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలే లక్ష్యంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. దీంతో భారత్‌లోని సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు చేపట్టేందుకు పాక్ యత్నించగా.. వీటిని భారత దళాలు దీటుగా తిప్పికొట్టాయి. ఈ క్రమంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సహనాన్ని అలుసుగా తీసుకుంటే ఆపరేషన్ సిందూర్ తరహా చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. దేశభద్రతకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని స్పష్టంచేశారు. మేం ఎల్లప్పుడూ సంయమనంతో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాం. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడాన్ని విశ్వసిస్తాం. దీనర్థం ఎవరైనా మా ఓపికను దుర్వినియోగం చేయవచ్చని కాదు. మా సహనాన్ని అవకాశంగా తీసుకోవాలని ప్రయత్నిస్తే.. ఆపరేషన్ సిందూర్ మాదిరిగా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. భారత బలగాలు ఆపరేషన్ సిందూర్‌ను ఊహించని కచ్చితత్వంతో అమలు చేశాయని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తోపాటు- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలను ధ్వంసం చేశాయని, ఇందులో అనేకమంది ఉగ్రవాదులు హతమయ్యారని చెప్పారు. ఈ ఆపరేషన్‌లో సాయుధ బలగాలు ధైర్యసాహసాలు ప్రదర్శించాయని ప్రశంసించారు. సామాన్యులకు ఎటు-వంటి నష్టం వాటిల్లకుండా ఈ ఆపరేషన్ చేపట్టామని, అత్యాధునిక పరికరాలు, సుశిక్షితులైన సాయుధ దళాల పనితీరువల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకున్ననిర్ణయాన్ని అఖిలక్షం సమర్థించింది. సైన్యానికి బాసటగా ఉంటామని రాహుల్ తదితరులు ప్రకటించారు. ఈ క్రమంలో పాకిస్థాన్‌లో, పాకిస్థాన్ ఆక్రమిత జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాద స్థావరాలే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అప్పుడే ముగిసిపోలేదని కేంద్రం ప్రకటించింది. ఆపరేషన్ సిందూర్ ముగిసిపోలేదని, ఇంకా కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. అయితే భద్రతా కారణాల రీత్య ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన వివరాలను బయటపెట్టలేమని అన్నారు. అదేవిధంగా ఆపరేషన్ సిందూర్‌పై పాకిస్థాన్ అసత్య ప్రచారం చేస్తోందని, ఆ ప్రచారాన్ని ఎవరూ నమ్మవద్దని కిరణ్ రిజిజు చెప్పారు. కాగా పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా బుధవారం తెల్లవారుజామున భారత్.. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై సర్జికల్ స్ట్రయిక్స్ర్ చేసింది. ఆపరేషన్ సిందూర్ పేరుతో నిర్వహించిన ఈ సర్జికల్ ÷-టస్రైక్స్ర్‌లో మొత్తం 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు.

# శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్‌ శంకుస్థాపన

**ఆవిష్కరణలు పెట్టుబడులతో భవిష్యత్‌కు బాటలు**

**కార్యక్రమంలో మంత్రి లోకేశ్ వెల్లడి**

**తిరుపతి,మే8(పద్మక్రాంతి):**

ఆవిష్కరణ, పెట్టుబడి కలిసేచోట భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఏపీని ఎలక్ట్రానిక్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు బాటలు వేస్తున్నామన్నారు. ఈరోజు ఎల్జీ యూనిట్‌కు మాత్రమే కాదు.. ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు కంటే పెద్దది. ఇది రాష్ట్రంతో పాటు- దేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. రూ.5వేల కోట్లకు పైగా పెట్టుబడితో రాష్ట్రానికి ప్రపంచస్థాయి తయారీ యూనిట్‌ను ఎల్జీ తీసుకొచ్చింది. 'మేడ్ ఇన్ ఆంధ్రా నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్' వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుందని లోకేశ్ అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా శ్రీసిటీ- యూనిట్‌లో ఎల్జీ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు, ఏపీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంతో పాటు- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నామని లోకేశ్ అన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ ఇగురువారం పర్యటించారు. యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారు. రూ. 839 కోట్లతో ఐదు అనుబంధ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కంపెనీకి భూమి పూజ చేయడంతో 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని చేరుకునే దిశగా రాష్ట్రంలో మరో అడుగు పడింది. రూ. 5,001 కోట్ల పెట్టుబడిలో భాగంగా 2 వేల ఉద్యోగావకాశాలను కల్పించనున్నారు. ఎల్జీ తమ సంస్థలు ఏర్పాటు- చేయడంతో ఇక్కడ ఎల్జీ సిటీ- ఏర్పడనుందని లోకేశ్ అన్నారు. విదేశీ సంస్థల ప్రతినిధుల రాకపోకలకు రాబోయే నాలుగు సంవత్సరాల్లో తిరుపతికి అంతర్జాతీయ విమానయానం పెరిగేలా చేస్తామని చెప్పారు. పరిశ్రమలు తీసుకు రావటానికి మంత్రులు, కలెక్టర్లు మాత్రమే కాదని..ప్రతి నియోజక వర్గం మరో నియోజక వర్గంతో పోటీ-పడాలని అన్నారు. పరిశ్రమల ఏర్పాటు-కు అన్ని రకాలుగా తోడ్పాటు- అందిస్తామని తెలిపారు. ఎల్జీ సంస్థ రూ.5000 కోట్లతో ఏర్పాటు- చేస్తున్న పరిశ్రమ ఆంధ్రప్రదేశ్‌కు మరిన్ని పెట్టుబడులు పెట్టే నమ్మకాన్ని తెచ్చిందని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మంత్రి నారా లోకేష్ పర్యటిస్తున్న నేపథ్యంలో ముందస్తు అనుమతితో కేబినెట్‌కు రావడం లేదని సమాచారం ఇచ్చారు. శుక్రవారం సత్య సాయి జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఆ ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు కేబినెట్ సమావేశానికి మరో మంత్రి పయ్యావుల కేశవ్ హాజరు కాలేదు. విదేశీ పర్యటనలో ఉన్న కారణంగా కేబినెట్ భేట-కి మరో మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరుకాలేదు. ఈ మేరకు మంత్రులు ముందస్తు అనుమతి పొందారు.

# పేదల ఇళ్లు కూల్చడం హైడ్రా లక్ష్యం కాదు





మొదటి పేజీ తరువాయి

ఉన్న హైదరాబాద్‌ను కాపాడుకునేందుకు.. హైడ్రా ఉపయోగపడుతుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధ భవన్‌లో తొలి హైడ్రా పోలీస్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. చెరువులను ఆక్రమించిన వారు ఎంత పెద్దవారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎవరేమనుకున్నా కూల్చివేతల విషయంలో మాత్రం హైడ్రా వెనక్కి తగ్గేది లేదని తెలిపారు. వర్షం వస్తే చెన్నై, ముంబై మహానగరాల పరిస్థితి ఏంటో చూస్తున్నామని ఆయన సోదాహరణగా వివరించారు. కాలుష్యంతో ఢిల్లీ విలవిల్లాడుతోంది.. ఈ పరిస్థితికి మానవ తప్పిదాలే కారణమని ఆయన పేర్కొన్నారు. మంచి పరిపాలన అందించేందుకు గడిచిన 76 ఏళ్లలో.. రాజ్యాంగాన్ని 100 సార్లకుపైగా సవరించుకున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గుర్తు చేశారు. నగరాభివృద్ధి కోసం గత సీఎంలు ఎన్నో చట్టాలు చేశారన్నారు. 1908లో హైదరాబాద్‌లో వచ్చిన వరదలు చూసి.. అప్పటి నిజాం నవాబు కన్నీరు సైతం పెట్టు-కున్నారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. అనంతరం హైడ్రా పోలీస్ స్టేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా వెబ్‌సైట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే 122 హైడ్రా వాహనాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. హైడ్రా తొమ్మిదిన్నర నెలల్లో ప్రజలకు మరింత చేరువైందన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ శాఖకు సంబంధించిన అధికారాలు.. హైడ్రా పోలీస్ స్టేషన్ ద్వారా కల్పించారన్నారు. వివిధ సందర్భాల్లో ఈ అధికారాలు తమకు ఉపయోగపడతాయని తెలిపారు. సీఎం ఏ ఉద్దేశ్యంతో హైడ్రాను ప్రారంభించారో.. అదే ఉద్దేశ్యంతో ఈ సంస్థ పని చేస్తుందని వివరించారు. సామాజిక బాధ్యతతో హైడ్రా ముందుకు వెళ్తుందని చెప్పారు. అసెస్ట్ ప్రొటెక్షన్ మాత్రమే కాకుండా.. డిజాస్టర్ రెస్పాండ్స్ కూడా సరైన అధికారులతో హైడ్రా పని చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.సాంకేతిక పరిజ్ఞానం కూడా పెద్ద ఎత్తులో వాడుతూ ఎఫ్‌టీ-ఎల్ పరిధి గుర్తిస్తున్నామన్నారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ఏర్పాటు- ద్వారా ల్యాండ్ గ్రేబింగ్, చీటింగ్, ఫోర్జరీ చేసే వారిపై చర్యలు తీసుకోనే అవకాశం దక్కిందన్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు హైడ్రా ఇలాగే ముందుకు వెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. హైడ్రా పోలీస్ స్టేషన్ ప్రారంబోత్సవ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ మేయర్ జి. విజయలక్ష్మితోపాటు- పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అమెరికా-బ్రిటన్ వాణిజ్య ఒప్పందంపై నేడు చర్చ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బ్రిటన్ తో వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించనున్నారని అమెరికా మీడియా పేర్కొంది. గొప్పదైన, అత్యంత గౌరవప్రదమైన దేశంతో అమెరికా "పెద్ద వాణిజ్య ఒప్పందం" కుదుర్చుకోబోతున్నదని డొనాల్డ్ ట్రంప్ బుధవారం ప్రకటించారు. వైట్ హౌస్‌లోని ఓవల్ కార్యాలయంలో ఉదయం 10:00 గంటలకు సమావేశంలో ఈ ఒప్పందాన్ని ప్రకటిస్తానని ఆయన చెప్పారు. అయితే ఆ దేశం ఏమిటన్నది అమెరికా మీడియా నేడు తెలిపింది. గత నెలలో అమెరికా వాణిజ్య భాగస్వాములపై ? ట్రంప్ భారీ సుంకాలను విధించారు. తాత్కాలికంగా నిలిపివేసిన వాటిపై వాణిజ్య ఒప్పందాల చర్చలకు అనుమతించనున్నారు. బ్రిటన్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారు అయిందా లేదా రెండు దేశాలు తదుపరి చర్చలకు లోబడి ఉండే ఒప్పందం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్‌ను ప్రకటిస్తాయా అనేది స్పష్టంగా లేదని టైమ్స్ పేర్కొంది.

## సంపాదకీయం

# పద కవితా పితామహుడు

దక్షిణా పథాన భజన సాంప్రదాయానికి, పద కవితా శైలికి ఆద్యుడు, ఆరాధ్యుడు. అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు (మే 9, 1408 – ఫిబ్రవరి 23, 1503) తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనా చార్యులకు మార్గ దర్శకుడైన, భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం భావ లాలిత్యంతో నిండిఉన్న అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. తెలుగు సంస్కృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచు కున్నాయి. ఆధ్యాత్మిక పదాలు, శృంగార గీతాలు, తుమ్మెదల, గొబ్బిళ్ళ పాటలు, శతకాలు, అన్నమయ్య విరచిత, 32 వేల ఆశుకవితా రూపాలలో చాలా వరకు లభ్యాలై, ప్రజల నోళ్లలో నానుతునే ఉన్నాయి. కన్నడ వాగ్గేయకారుడు "పురందరదాసు" అన్నమయ్యను, ఏడుకొండల స్వామి అవతారంగా ప్రశంసిస్తే, మహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ఆచరణుల నమ్మకం. అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చిన్నన్న రాసిన "అన్నమయ్య చరితం" ద్విపద కావ్యం ద్వారా ఆయన సమాచారం లభిస్తున్నది. క్రీస్తుశకం పదవ శతాబ్దిలో, నేటి కర్నూలు జిల్లాలోని ప్రాంతాలను నందుడనే రాజు పాలించగా, ఆ రాజు కాశీయాత్ర సమయాన, కాశీలో కొందరు వైదిక బ్రాహ్మణులు పరిచయం కాగా, కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్ర దేశానికి తరలి వచ్చి స్థిరపడగా, తీసుకొని రాబడిన వారు వైదీకులు అయినందున, నంద వైదీకులుగా ప్రచారం పొందినట్లు, అన్నమయ్య అదే కోవకు చెందిన వారై, "తాళ్ళపాక గ్రామం" ఇంటి పేరుగా కలిగి ఉన్నారని ప్రచారం ఉంది. వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో శుభ లగ్నాన, మూడు గ్రహాలు ఉచ్చ స్థితిలో ఉండగా, నారాయణ సూరి – లక్కమాంబలకు "నందకం" అంశమున సర్వధారి సంవత్సర వైశాఖ శుక్ల పౌర్ణమి నాడు 1408 మే 9న అన్నమయ్య ఉదయించారు. నారాయణ మూర్తి పరబ్రహ్మ వాచకంగా "అన్నమయ్య" అని నామకరణం గావించారు. "అన్నమయ్య", "అన్నమాచార్యులు", "అన్నయ గురు", "అన్నయ్య", "కోనేటి అన్నమయ్యం గారు" అనే నామాంతరం తాళ్లపాక సాహిత్యం శాసనాలలో చోటు చేసుకున్నాయి. శిశు ప్రాయం నుండి అన్నమయ్య వెంకట నాథుని మీద ధ్యాస ఉంచేవారు. ఉగ్గు పాలు తాగడం లో, నిద్రకు ఉపక్రమించడంలో, లక్కమాంబ గీతాలు, జోల పాటలు, నారాయణ మూర్తి కావ్య పఠనాలు, అన్నమయ్యపై శైశవ దశలోనే ప్రభావం చూపాయి. ఏకసంతాగ్రాహియై, ఉపనయన సంస్కారం అనంతరం చిరు ప్రాయం నుండే, కలియుగ దైవంపై వింత వింత సంకీర్తనలు నోటి నుండి జాలు వారగా, పదహారేళ్ల ప్రాయం నుండి రోజు కొక్క సంకీర్తనం తప్పక రాయడం మానలేదు. చెరువుగట్టు మీద, చెట్టుపై పిట్టలు, చిరుగాలి సవ్వడులలో, అలల కదలికలలో, మమేకమై సాగిన ఆయన జానపద నేపథ్యంలో, అన్నమయ్య పాటన్నా, మాటన్నా, గ్రామీణులకు సంబరాన్ని కలిగించేవి. ఉమ్మడి కుటుంబంలో, పనులు చేయడం నచ్చక, లౌకిక బంధాలతో, తమకు ఇక పనిలేదని తెలుసుకొని, వేదనలో విరక్తి కలిగి, భక్తి రగిలి, భక్తి రసావేశ భరితులై, తంబుర చేతబూని, తిరుమల దారి పట్టా డు. సనక సనందాదులే భక్తులై తోడురాగా తిరుపతి చేరారు. సకలాభరణ శోభితుడు, భూషితుడు అయిన శ్రీ మూర్తిని దర్శించుకున్నారు. తిరుమలలో "ఘన విష్ణువు" అనే మునితో శంఖ చక్రాదికములతో, పంచ సంస్కారాలను నిర్వహింప చేసుకున్నారు. వైష్ణవ తత్వాలను, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను, అధ్యయనం చేస్తూ, వెంకన్నను కీర్తిస్తూ, తిరుమలలోనే జీవితం గడిపారు. గురువు ఆనతిపై, తాళ్ళపాక వెళ్లి తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నా, వారితో తిరిగి తిరుమల దర్శనం చేసుకున్నారు. 95 ఏళ్ళ పూర్ణ వయస్కుడై, అన్నమయ్య దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 1503 ఫిబ్రవరి 23న పరమపదించారు. అన్నమయ్య సంకీర్తనా సేవ, సంగీత సాహిత్య భక్తి పరిపుష్టం. తెలుగు లోనే రాసినా పాడినా ఆయన సాహిత్యం సంస్కృత పద భూయిష్టం. అన్నమయ్య యోగ వైరాగ్య శృంగారం సరణి మొత్తం 32 వేల సంకీర్తనలు రచించారని అనుకొంటున్నా, ఆయన వారసులు రాగి రేకులపై వ్రాయించి, తిరుమలలో సంకీర్తనా భాండాగారం నందు పొందు పరిచినవి, ప్రస్తుతం 12 వేలు మాత్రమే. మంజరి ద్విపదలో "శృంగార మంజరి" అనే కావ్యాన్ని రచించారు. ఆయన రచనలని చెప్పబడే 12 శతకాలలో "వెంకటేశ్వర శతకము" మాత్రమే లభిస్తున్నది. "అదివో అల్లదివో, క్షీరాబ్ధి కన్యకకు, జో అచ్యుతానంద, ఉదయాద్రి తెలిపాయే, కొండలలో నెలకొన్న, మూసిన ముత్యాల, నిగమ నిగమాంత, లాంటి అన్నమయ్య కీర్తనలు, తెలుగు సంగీతాభిమానులకు, నిత్యం వీనులకు విందు చేస్తూనే ఉన్నాయి. "సంకీర్తనాచార్యుడు", "పదకవితా పితామహుడు", "పంచమాగమ సార్వభౌముడు", "ద్రావిడ ఆగమ సార్వభౌముడు"అని బిరుదాంకితుడు అయిన, అన్నమయ్య వాసిలో, రాశిలో, రచనలు ఆంధ్ర వ్మాయంలో సరిరానివి అనడంలో అతిశయోక్తి లేదు.

# ఉగ్రవాదుల పేరిట ఇంతటి అరాచకమా..

పాకిస్థాన్ ప్రభుత్వం బుధవారం తమ దేశంలోని భారత దౌత్య వ్యదహారాలఅధినేత (ఐసిఎ)గీతికా శ్రీవాత్సవను పిలిపించి మాట్లాడింది. తెల్లవారు జామున జరిగిన ఆపరేషన్ సిందూర గురించి ప్రశ్నించింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారతీయ సైన్యం ఆపరేషన్ సిందూర పేరిట దాడులు జరిపింది. ఈ క్రమంలోనే పలు ఉగ్ర శిబిరాలు ధ్వంసం అయ్యాయి. వంద మంది వరకూ ఉగ్రవాదులు హతులు అయ్యారు. ఇస్లామాబాద్‌లోని దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యాలయానికి రావల్సిందిగా భారత దౌత్యాధికారిణికి ముందుగా సమన్లు వెలువరించారు. ఉగ్రవాదుల ఏరివేత పేరిట సాగిన ఈ దాడిలో పలువురు పౌరులు , పిల్లలు, మహిళలు మృతి చెందారని, ఈ చర్యకు ఎవరు బాధ్యత వహిస్తారని పాకిస్థాన్ ఈ సందర్భంగా భారతీయ ప్రతినిధిని నిలదీసింది. అయితే ఉగ్రవాదుల ఉనికి గురించి తెలిసినందునే , నిర్ణీత లక్షాలను ఎంచుకుని భారత సేనలు దాడికి దిగాయని గీతిక తెలిపింది. ఈ వాదనను పాకిస్థాన్ తోసిపుచ్చింది. ఉగ్రవాద నిర్మూలన పేరిట ఆధారాలు లేకుండా సాగించిన ఈ సైనిక చర్య విచక్షణారహితం, పైగా తమ దేశ సుస్థిరత, సమగ్రతలకు భంగకరం అని ఆగ్రహం వ్యక్తం చేసింది. పాకిస్థాన్ నిరసనకు భారతీయ దౌతాధికారిణి సరైన రీతిలోనే ఎదురుదాడికి దిగారని అధికార వర్గాలు తెలిపాయి. ఉగ్రవాదులు సరిహద్దులు దాటి వచ్చి నరమేధం సాగిస్తే చూస్తూ ఊరుకుంటారా? అని నిలదీసిన గీతిక ఈ విషయంలో తమ దేశ వైఖరి సబబే అని చెప్పి బయటకు వచ్చినట్ల వెల్లడైంది.

# ఉదార జాతీయవాది

స్వాతంత్ర్య సమరంలో తెరముందు కనిపించి, పోరాట యోధులుగా, త్యాగధనులుగా, ప్రజానాయకులుగా చరిత్రపుటలకు ఎక్కినవారు కొందరైతే, సమర నేపథ్యంలో తెర వెనుక నిశ్శబ్దంగా కార్యకలాపాలు సాగించిన వారెందరో. లక్ష్యం ఒకటే స్వాతంత్ర్య సాధన. మార్గాలు, కార్యాచరణ మార్గాలు వేరు. స్వాతంత్ర్య సమరంలో నిరంతరం కదలాడుతూ, గాంధీజీ, నేతాజీ, తిలక్, లాలాలజపతి రాయ్, టంగుటూరి ప్రకాశం లాంటి యోధులు ముందు వరుసలో ఉంటే, నిశ్శబ్దంగా, నిర్మాణాత్మకంగా, ఆచరణాత్మకంగా ఉద్యమాలకు ఊపిరిపోసి, లక్ష్య సాధనలో తమ జీవితాల్ని జాతికి ధారపోసి, తెర వెనుక నిలిచిన వారెందరో... అలాంటి తెర వెనుక కార్యసాధకులలో అగ్రగణ్యులు గోపాలకృష్ణ గోఖలే.ఆయన ఆంగ్లంలో నిష్ణాతుడవడమే మాకుండా పాశ్చాత్య రాజకీయాలను అవగాహన చేసుకున్నారు. పాశ్చాత్య తత్వ శాస్త్రాన్నీ ఆకళింపు చేసుకున్నారు.భారతీయ, పాశ్చాత్య సంస్కృతుల మధ్య సమన్వయకర్తగా నిలిచిన గోపాలకృష్ణ గోఖలేను అటు శ్వేత జాతి పాలకులు, ఇటు దేశీయ అధిక సంఖ్యాక నేతలు విశ్వసించారు. అలాంటి భిన్న వ్యక్తిత్వ కారణంగానే గాంధీ, ముహమ్మద్ అలీజిన్నా లాంటి వారిని ఆకట్టుకొని, వారిని తమ రాజకీయ 'గురువు'గా భావించేలా చేసింది.గోపాలకృష్ణ గోఖలే (మే 9, 1866 – ఫిబ్రవరి 19, 1915) మహారాష్ట్ర లోని రత్నగిరి జిల్లాలోని కోట్లుక్‌లో 1886 మే 9న ఒక సాంప్రదాయిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. విశ్వవిద్యాలయ స్థాయి విద్యను అభ్యసించిన తొలితరం భారతీయులలో ఆయన ఒకరు. జస్టిస్ రణడే శిష్యరికంలో భారతీయ అర్ధశాస్త్రాన్ని అభ్యసించి, పూనాలోని ఫెర్గూసన్ కళాశాలలో చరిత్ర, రాజకీయార్థ శాస్త్ర ఆచార్యునిగా చేరారు.తరువాత ఆ కళాశాల ప్రిన్సిపాల్ అయ్యారు. ఆ సమయంలోనే ఆయన పదవికి రాజీనామా చేసి భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరారు. 1900 సంవత్సరంలో బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యునిగా ఎన్నికైన గోఖలేకి అక్కడ ఫిరోజ్‌షా మెహతా సహచర్యం లభించింది. 1902 లో వైస్రాయ్ కౌన్సిల్ సభ్యులయ్యారు. ఆ సమయంలో అస్తవ్యస్తతమై ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ గురించి గోఖలే ఉపన్యసించిన తీరు పలువురిని ఆకట్టుకుంది. ఆయనలోని ఆర్థిక వేత్తను ప్రపంచానికి పరిచయం చేసింది. 1905 లో బెనారస్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో అధ్యక్షుడిగా ఎన్నికైనపుడు గోఖలే చేసిన ప్రసంగం నేటికీ అత్యుత్తమ ప్రసంగాలలో ఒకటిగా కీర్తించ బడుతోంది. 1902 నుంచి 1915లో మరణించే వరకు భారత శాసన మండలి సభ్యుడిగా ఉన్నారు. గొప్ప విద్యావేత్తగాను, పార్లమెంటేరియన్ గాను ఘనమైన చరిత్ర ఉంది. 1905లో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీని ఏర్పాటుచేశాడు. బ్రిటీష్ వారి విధానాలను తీవ్రంగా వ్యతిరేకించకున్ననూ భారతీయులలో జాతీయతా భావాన్ని పెంపొందించ డానికి విశేష కృషిచేశారు.విదేశాలలో వున్న భారతీయుల హక్కుల సాధన పట్ల శ్రద్ధ క్రమంలో, దక్షిణాఫ్రికాలో భారతీయుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించిన గాంధీ పరిచయం అయ్యారు. అలా వారి పరిచయం గురుశిష్యుల బంధంగా అభివృద్ధి చెందింది.భారతదేశంలో రాజ్యాంగ సంస్కరణల ప్రక్రియకు ఊతం అందించిన మాంటెగ్ చెమ్స్‌ఫర్డ్ చట్ట రూపకల్పనలో, బెంగాల్ విభజన జరిగిన సందర్భంలో, భారత జాతీయ కాంగ్రెస్ చరిత్రలో, బ్రిటిష్ ఇండియా చరిత్రలో గోఖలే పాత్ర ఎన్నదగినది. (1905) కాశీలో జరిగిన కాంగ్రెస్ వార్షిక సభలలో విదేశీ వస్తు బహిష్కరణ వంటి కీలక నిర్ణయం తీసుకున్న సభలకు అధ్యక్షునిగా గోఖలే ఉండడం గమనార్హం. బ్రిటిష్ పాలనకు విధేయత చూపిస్తూ దేశ వ్యవహారాలను నడిపించడంలో ఆయన మితవాదిగా ముద్ర వేసుకున్న నేపథ్యం. సైద్ధాంతిక భేదాలు ఉన్నా, గోఖలే తన ప్రత్యర్థులతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించారు.బొంబాయిలో, గోఖలే... బ్రిటిష్ ప్రభుత్వ కఠినమైన భూ ఆదాయ విధానాలను వ్యతిరేకించారు. ఉచిత మరియు నిర్బంధ ప్రాథమిక విద్యను సమర్థించారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా పోరాడటానికి వెనకాడలేదు. గోఖలే సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ ని స్థాపించారు. గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పొలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ (గోఖలే ఇన్‌స్టిట్యూట్ అనే పేరుతో ప్రసిద్ధి). భారత్ లో ప్రాచీన ఆర్థికశాస్త్ర విద్యాలయం. ఇది మహారాష్ట్ర పుణె లోని జింఖానా ప్రాంతంలో సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వారి ఆర్థిక సహాయముతో స్థాపించబడిన విద్యాలయం. నేటికినీ సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వారే ఈ విద్యాలయానికి ట్రస్టీలు. గోఖలే పిలుపు మేరకే గాంధీజీ 1915లో దక్షిణాఫ్రికాను వీడి శాశ్వతంగా భారత దేశానికి వచ్చారు. పలువురిని ప్రభావితం చేసిన గోపాల కృష్ణ గోఖలే గాంధీజీ వచ్చిన దాదాపు నెల రోజులకే ఫిబ్రవరి 19, 1915న గోఖలే తుదిశ్వాస విడిచారు.

# తెలంగాణ పర్యాటకానికి పెద్దపీట






**అందాల పోటీల నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు**
**ఆయా ప్రాంతాలను సందర్శించేలా కార్యక్రమాలు**

**హైదరాబాద్,మే8(పద్మక్రాంతి):**

అంతర్జాతీయ అతివల అందాల పోటీలతో తెలంగాణ టూరిజానికి మహర్దశ పట్టనుంది. ఇక్కడికి వచ్చే వారంతా తెలంగాణ లోని ప్రధాన పర్యాకట కేంద్రాలను సందర్శించనుండంతో వాటి ప్రాముఖ్యత ప్రపంచానికి తెలియనుంది. ముఖ్యంగా గ్రామీణ పర్యాటకం వెలుగులోకి రానుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇందుకు అనుగుణంగా భారగా ఏర్పాట్లు చేసింది. ఆహుతును పర్యాటక ప్రాంతాలకు తీసుకుని వెళ్లేలా ఏర్పట్లు చేసింది. తెలంగాణ పర్యాటకం అంటే రాజధాని హైదరాబాద్ మాత్రమే. మిస్ వరల్డ్ ఈవెంట్ ల నిర్వహణను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ పర్యాటకంను ప్రపంచ వ్యాప్తంగా ప్రమోట్ చేసేందుకు ప్రాధాన్యత ఇస్తోంది. తెలంగాణ గ్రామీణ సాంస్కృతిక, చారిత్రక, పర్యాటక వైభవంను ప్రపంచానికి పరిచయం చేసేందుకు మిస్ వరల్డ్ ఈవెంట్‌ను అందివచ్చిన అద్భుత అవకాశంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించుకునేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది.ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలకు విశేష ప్రచారం దక్కనుంది. తెలంగాణ సాంస్కృతిక వైభవం, చారిత్రక గాథలు, ఆధునిక అభివృద్ధి, పర్యాటక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలుపడంతో పాటు– తెలంగాణ గ్రామీణ పర్యాటక ప్రదేశాలను ప్రపంచ పటంలో ప్రముఖంగా నిలిపే అవకాశం లభిస్తుంది. నాగార్జునసాగర్ బుద్ధవనం , బౌద్ధ థీమ్ పార్క్, బౌద్ధ సంస్కృతి , ఆధ్యాత్మికతకు ప్రత్యేకించిన ఆకర్షణ. ఇది బుద్ధుని విగ్రహాలు, స్తూపాలు, ధ్యాన మండపాలతో కూడిన ప్రశాంత వాతావరణాన్ని సృష్టిస్తుంది. ఇక్కడి థీమ్ పార్క్ బుద్ధుని జీవితం, బోధలు, బౌద్ధ కళ, సంస్కృతిని సజీవంగా ప్రదర్శిస్తుంది. ఈ ప్రాజెక్టు పర్యాటక రంగాన్ని బలపరుస్తూ, సాంస్కృతిక మార్పిడి, ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతోంది. ఆధ్యాత్మిక శాంతి, జ్ఞానోదయం కోసం ప్రయత్నిస్తున్నవారికి ఇది ఒక ఆదర్శ స్థలం. హన్మకొండ జిల్లా కేంద్రంలో ఉన్న వేయి స్థంభాల గుడి, కాకతీయ రాజవంశం శిల్పకళా వైభవానికి నిదర్శనం. రుద్రదేవ మహారాజు 12వ శతాబ్దంలో నిర్మించిన ఈ గుడి శివుడు, విష్ణువు సూర్యదేవుడికి అంకితమైంది. ప్రత్యేకమైన త్రికూటాకార నిర్మాణంతో, నక్షత్ర ఆకారపు వేదికపై నిలిచి ఉంది. గర్భగుడి చుట్టూ 1000కు పైగా సున్నితంగా చెక్కబడిన స్థంభాలు ఉన్నాయి. ప్రధాన ఆకర్షణ ఏకశిలా నంది విగ్రహం, ఇది శిల్పుల నైపుణ్యాన్ని చాటుతుంది. ఈ దేవాలయం తురుష్కుల దండయాత్రలో కొంత భాగం నాశనమై, 20వ శతాబ్దంలో పునరుద్ధరించబడింది. ప్రాచీన భారతీయ వాస్తుశిల్పం అద్భుతమైన నమూనాగా నిలిచింది. కాకతీయ రాజవంశం వాస్తుశిల్ప వైభవానికి అద్భుతమైన నిదర్శనమే వరంగల్ కోట. 13వ శతాబ్దంలో నిర్మించబడిన ఈ కోట కాకతీయుల రాజధానిగా, వ్యూహాత్మక స్థానంగా పనిచేసింది. 3 కిలోమీటర్లకు పైగా విస్తరించిన భవ్యమైన ప్రాకారాలు, దీని గొప్పతనాన్ని ప్రతిబింబిస్తాయి. కాకతీయ కళాతోరణం అనే సూక్ష్మశిల్పాలు కలిగిన తోరణం ఈ కోటకు ప్రత్యేక ఆకర్షణ. స్వయంభూ దేవాలయంలోని శివలింగం భక్తులకు పవిత్ర తీర్థస్థలం. కోటలోని ధాన్యాగారాలు, సరుకు గిడ్డంగులు ఆ కాలపు సంపదను తెలియ జేస్తున్నాయి. తెలంగాణ సంపన్న సాంస్కృతిక వారసత్వానికి ఈ కోట ఒక జీవంత ముద్ర. చారిత్రక ప్రాధాన్యత, శిల్ప సౌందర్యం కారణంగా ప్రతి ఒక్కరూ ఇక్కడికి తప్పక వెళ్లాల్సిన ప్రదేశంగా ఇది నిలిచింది. ములుగు జిల్లా పాలంపేట వద్ద ఉన్న రామప్ప గుడి, కాకతీయ సామ్రాజ్యం వాస్తు శిల్ప సంపదకు ప్రతీక. ఇది 13వ శతాబ్దంలో గణపతి దేవ మహారాజు పాలనలో నిర్మించబడింది. ఈ శివాలయానికి ప్రధాన శిల్పి రామప్ప పేరు మీదుగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి శిల్పాలు, సుందరమైన నృత్య ముద్రలు, పురాణ కథలను చిత్రించే శిల్పాకృతులు అద్భుతంగా ఉంటాయి. 2021లో యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తించబడిన ఈ దేవాలయం చుట్టూ సహజ సుందరమైన చెరువు, హరిత వనాలు ఉన్నాయి. పోచంపల్లి ప్రాంతంలో నేతన్న మేధస్సుతో తయారయ్యే పోచంపల్లి ఇక్కత్ చీరలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ నేతకళలో నూలు లేదా పట్టుదారాలను డైలో ముందుగా రంగు వేసి, సంక్లిష్టమైన జ్యామితీయ నమూనాలతో నేస్తారు. 120 దేశాల ప్రతినిధులు హాజరయ్యే.. 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యే మిస్ వరల్డ్ పోటీలు ఈవెంట్‌లో తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, గ్రామీణ పర్యాటకంకు ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖంగా ప్రమోట్ చేసేందుకు , పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను ఆకర్షించుకునేందుకు తద్వారా గ్రామీణ ముఖ చిత్రాన్ని మార్చేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మిస్ వరల్డ్ పోటీలలో భాగంగా వరంగల్ , హన్మకొండ , ములుగు, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్ జిల్లాలోని పర్యాటక ప్రదేశాలను షోకేజ్ కు చేసేందుకు రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలను మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు సందర్శించనున్నారు. మిస్ వరల్డ్ ఈవెంట్‌లో భాగంగా ఈనెల 12న ఆధ్యాత్మిక టూరిజానికి చిహ్నంగా ఉన్న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని, బుద్ధిష్టు థీమ్ పార్కును మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు సందర్శించనున్నారు. అలాగే ఈ నెల 14న చారిత్రక, ఆధ్యాత్మిక నగరం వరంగల్‌లోని వెయ్యి స్థంభాల గుడి, వరంగల్ పోర్టును సందర్శిస్తారు. ఇదే రోజు వరంగల్ జిల్లాలో యునెస్కో వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయంను సందర్శిస్తారు. అక్కడే ఏర్పాటు– చేసిన పేరిణి నృత్యంను తిలకిస్తారు. 15న యాదగిరిగుట్ట ఆలయాన్ని సందర్శిస్తారు. హ్యాండ్లూమ్ ఎక్స్‌పీరియన్సల్ టూర్‌లో భాగంగా పోచంపల్లిలో చేనేత వస్త్రాల తయారీని, ప్రదర్శనను ప్రత్యక్షంగా తిలకిస్తారు. 16న మహబూబ్‌నగర్ జిల్లాలోని పిల్లలమర్రి వృక్షాన్ని సందర్శిస్తారు. 21న శిల్పారామంలో తెలంగాణ కళాకారుల చే నిర్వహించే ఆర్ట్స్ , క్రాఫ్ట్స్ వర్క్ షాప్‌కు హాజరవుతారు. స్వయంగా వాటి తయారీలో భాగమై ప్రత్యక్షంగా తయారీ గురించి తెలుసుకుంటారు. మొత్తంగా తెలంగాణ టూరిజానికి ప్రాముఖ్యత ఏర్పడనుంది.



# బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ రూ.2 లక్షల చెక్కు అందజేత

**మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిశోర్ కుమార్**



**అడ్డగూడూరు, తుంగతుర్తి (పద్మక్రాంతి ప్రతినిధి):**

అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త గుడిపాటి విజయ గత కొన్ని రోజుల క్రితం ప్రమాదవశాత్తు మరణించారు. వారికి భారత రాష్ట్ర సమితి పార్టీ యొక్క క్రియాశీలక సభ్యత్వం పొందినటువంటి కార్యకర్త కావడంతో, వెంటనే స్పందించిన తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిశోర్ కుమార్ , మృతురాలికి సంబంధించిన ఎఫ్.ఐ.ఆర్ కాపీలు మరియు పోస్టుమార్టం రిపోర్టులను , భారత రాష్ట్ర సమితి పార్టీ ఇన్సూరెన్స్ విభాగానికి పంపించడంతో వారికి ఇన్సూరెన్స్ మంజూరైంది. అట్టి మంజూరైన భారత రాష్ట్ర సమితి పార్టీ ఇన్సూరెన్స్ రూ. 2,00,000 (రెండు లక్షల రూపాయల) చెక్కును, డా.గాదరి కిశోర్ కుమార్ చేతుల మీదుగా మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి , మాజీ మార్కెట్ చైర్మన్ చిప్పలపల్లి మహేంద్ర నాథ్ , మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య , మాజీ పి ఎస్ ఎస్ చైర్మన్ ఐతగోని వెంకటేశ్వర్లు , బీఆర్ఎస్ నాయకులు సత్యం గౌడ్ , పూల పెల్లి జనార్దన్ రెడ్డి , మేకల జగన్ , బాలెంల బాబు మహాజన్, శీలం దావీదు , కుకునూరు వెంకట్ రెడ్డి, బాలెంల అవినాష్ , జక్కుల యాదగిరి , మందుల కిరణ్, చిప్పలపల్లి నరేందర్,రాజు తదితరులు పాల్గొన్నారు.

# స్వర్గీయ శ్రీ గాజులగూడెం నర్సింలు పేరుతో ట్రస్ట్ ఏర్పాటు



**పద్మక్రాంతి, మే 08 (చేవెళ్ల- ప్రతినిధి):**

చేవెళ్ల మండల్ గొల్లపల్లి గ్రామంలో స్వర్గీయ గాజులగూడెం నర్సింలు (గెజిటెడ్ హెడ్ మాస్టర్) 4 వర్ధంతిని పురస్కరించుకొని ఆయన పేరుతో మీద జి యన్ సి పౌడేషన్ పేరుతో ఒక ట్రస్ట్ ను ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన విగ్రహ స్థలానికి నర్సింలు సార్ చౌరస్తాగా నామ కరణం చేశారు.స్వర్గీయ గాజులగూడెం నర్సింహులు వ్యవసాయ క్షేత్రం గొల్లపల్లిలో వారి విగ్రహానికి... వారి తమ్ముడు గాజులగూడెం చందు,కుటుంబ సభ్యులు గ్రామస్తులు,బందుమిత్రుల ఆధ్వర్యంలో 4వ వర్ధంతి కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది.అనంతరం వారంత ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి బీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయార్య క్షత్రియ హాజరైయ్యారు. ఈసందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ.... స్వర్గీయ నర్సింలు తన వ్యక్తిగత,వృత్తి దర్మంలో విద్యార్థులకు,సమాజానికి చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు,ప్రాదేశిక సభ్యులు సత్యం గౌడ్, శ్రీనివాస్ గౌడ్,లక్ష్మణ్ గౌడ్,వివిధ పార్టీల నాయకులురాజమహేంద్రవర్మ,జామచంద్రం,అరుణ్ రాజ్ ,యం.కుమార్ ,యం.రాజు,సీనియర్ లెక్చరర్ల మహేందర్, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు, బంధుమిత్రులు ఫాల్గొని నివాళి అర్పించారు.

# న్యాయమే సబితమ్మను గెలిచిందింది

**నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్ రెడ్డి**

**పద్మక్రాంతి,మే 08 (రాజేంద్రనగర్ ప్రతినిధి):**

అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో భూగర్బ గనుల శాఖ మంత్రిగా పని చేసిన మాజీ మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి పై వచ్చిన ఆరోపణలన్నీ కూడా కోర్టు కొట్టివేయడంతో సబితమ్మను న్యాయమే గెలిచిందిందని నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.గురువారం ఆయన సబితా ఇంద్రా రెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో నార్సింగ్ మున్సిపాలిటీ సీనియర్ నాయకులైన నిజాముద్దీన్, మల్లేష్, శేఖర్ రెడ్డి మహేష్ లు ఉన్నారు.



# విద్యా క్షేత్రంలో వెలుగులు చిమ్ముతోన్న చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల






**అనుభవంతో కూడిన అధ్యాపకులతో విద్యాబోధన**

**డిగ్రీ కళాశాల అడ్మిషన్లకై దరఖాస్తుల ఆహ్వానం**

**విద్యార్థుల కలలను సాకారం**

**చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత**

**పద్మక్రాంతి, మే 08 (చేవెళ్ల- ప్రతినిధి):**

విద్యా క్షేత్రంలో వెలుగులు చిమ్ముతోన్న చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల యందు అనుభవంతో కూడిన అధ్యాపకులతో విద్యాబోధన గావిస్తూ....డిగ్రీ కళాశాల అడ్మిషన్లకై నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య, నైపుణ్యాలు పెంపొందస్తూ మరియు ఉద్యోగ అవకాశాలకై అధ్యాపకులు ఎనలేని కృషి చేస్తున్నారు.అటువంటి ఆశయాల దిశగా విద్యార్థుల జీవితాల్లో చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెలుగులు నింపుతుంది.రంగారెడ్డి జిల్లాలోనే ఈ డీగ్రీ కళాశాల ముఖ్యమైన విద్యా సంస్థగా ప్రసిద్ధి పొందింది. నాణ్యమైన విద్యను అందిస్తూ, సమగ్ర అభివృద్ధికి దోహదపడే విధంగా రూపొందించబడిన ఈ కళాశాల అనేక ప్రత్యేకతలతో విద్యార్థుల మనసును గెలుచుకుంటుంది.

**అర్హత కలిగి అధ్యాపకులు చేత విద్యా బోధన..**

మంచి అర్హతలు కలిగి అధ్యాపకులు చేత విద్యా బోధన జరుగుతుంది.అధ్యాపకుల అనుభవం %-% విద్యలో నాణ్యతకు ప్రాతినిధ్యం వహించటంలో కళాశాల అధ్యాపక బృందం ప్రత్యేకత. ఎన్ఈటి,ఎస్ఈటి మరియు పీహెచ్ డి అర్హతలు కలిగి అధ్యాపకులు చేత విద్యా బోధన చేయటం ఈ కళాశాల ప్రత్యేకత. విద్యార్థులకు సుభోద్యంగా పాఠాలు బోధించడమే కాదు, వారిలో ఆలోచనా శక్తిని, విశ్లేషణా సామర్థ్యాన్ని పెంపొందించేలా మార్గనిర్దేశనం చేస్తున్నారు. అనుభవంతో కూడిన బోధన విద్యార్థుల విద్యా ప్రయాణాన్ని మరింత ఉన్నత స్థాయికి ఇక్కడి అధ్యపక బృందం తీసుకెళ్తోంది. నిరంతరం విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రవేశపెట్టిన (తెలంగాణ స్కిల్ %ు% నాలెడ్జ్ సెంటర్) ద్వారా విద్యార్థులు ఉద్యోగ ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాల్లో శిక్షణ పొందుతున్నారు.కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ ప్రావీణ్యం, ఇంటర్వ్యూ నైపుణ్యాలు వంటి అంశాలలో శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులను ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేస్తున్నారు.ఆధునిక వసతులు - విజ్ఞానానికి ప్రేరణ కళాశాలలో ఉన్న డిజిటల్ తరగతి గదులు, ప్రయోగశాలలు, ఉచిత హై-స్పీడ్ వైఫై, మరియు ఈ- బుక్స్,ఈ -జనరల్స్ వంటి లెర్నింగ్ వనరులు విద్యార్థుల నేర్చుకునే శక్తిని మెరుగుపరుస్తున్నారు. ఇది వారికి అగ్రశ్రేణి విద్యా సంస్థలతో పోటీపడే స్థాయిని కల్పిస్తోందన్నారు.సౌకర్యాల సమృద్ధి %-% విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అర్హత కలిగిన విద్యార్థులకు ప్రభుత్వ స్కాలర్షిప్లు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. అదనంగా, హాస్టల్ వసతి, బస్సు పాస్ సౌకర్యం తదితర వసతులు కల్పించబడడం విద్యార్థుల ఆర్థిక భారం తగ్గిస్తూ విద్యపై దృష్టి కేంద్రీకరించేందుకు సహాయపడుతోంది.వ్యక్తిత్వ వికాసం %-% సమాజానికి సేవా దృక్పథం, ఎన్ఎస్-ఎస్ కార్యకలాపాలు విద్యార్థులలో సేవాభావం, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత వంటి విలువల్ని బోధించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.యువతరంగం ద్వారా ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి పురస్కారాలు అందించడం, జెఐజిఎన్ఏఎస్ఏ ద్వారా పరిశోధనలపై ఆసక్తిని కలిగించడం కళాశాల ప్రత్యేకతల్లో ఇది ఒకటి.ఉద్యోగావకాశాల కోసం ఉచిత శిక్షణ %ు% ప్లేస్మెంట్స్ విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా పీజీ ప్రవేశ పరీక్షలు, ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కల్పించబడుతోంది. అంతేకాక, ప్రముఖ సంస్థలతో భాగస్వామ్యం ద్వారా క్యాంపస్ ప్లేస్మెంట్లు నిర్వహించబడుతుంది.

**విద్యార్థులకు చదువుతోపాటు క్రీడా సంస్కృతిక రంగాల్లో ఆసక్తి..**

విద్యార్థులకు కేవలం చదివే కాకుండా చదువుతోపాటు క్రీడా సంస్కృతిక రంగాల్లో కూడా విద్యార్థులకు ఆసక్తి కలిగించి అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు.ఆరోగ్యాన్ని సమతుల్యంగా పెంపొందించే క్రీడా వాతావరణం విశాలమైన ఆట మైదానంతో పాటు క్రీడా సామాగ్రి విద్యార్థుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కీలకంగా వ్యవహరిస్తోంది. చదువుతో పాటు శారీరక వికాసానికీ కళాశాల ప్రాధాన్యత ఇస్తున్నారు.

**విద్యార్థుల కలలను సాకారం**

**చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత**

విద్యార్థుల కలలను సాకారం చేసే కేంద్రంగా, సమగ్ర అభివృద్ధికి మార్గదర్శిగా చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందుకు సాగుతోంది. నేటి యువత తన భవిష్యత్తును నిర్మించుకోవాలనుకుంటే ఉత్తమమైన వేదిక చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై నిరంతరం కృషి చేస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నారు.

**పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నెంబర్లు..**

అడ్మిషన్లకు సమాచార కేంద్రం మా కళాశాలలో చేరదలచిన విద్యార్థులు చేవెళ్లలోని దోస్త్ హెల్ప్లైన్ సెంటర్ను 83281 76599, 94901 17490 సంప్రదించవచ్చు అని కళాశాల యాజమాన్యం తెలియజేస్తుంది.

# 20న జరిగే దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్**

**రెబ్బెన, మే 8, (పద్మక్రాంతి):**

ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. గురువారం రోజున సమ్మె నోటీసులు రెబ్బెన పి హెచ్ సి హాస్పిటల్ డాక్టర్ సుజిత్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడులను వెంటనే రద్దు చేయాలని 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.యన్ హెచ్ ఎం ఉద్యోగులందరినీ 510 జి ఓ లో నష్టపోయిన వారందరినీ కొత్త జీవో తీసి వారందరికీ వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి అందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు పిఆర్సి ఏరియాస్ ను వెంటనే చెల్లించాలని, నాలుగో తరగతి ఉద్యోగులకు కనీస వేతనం 26,000 చెల్లించాలని రెండవ ఏ ఎన్ ఎం లను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు, ఏజెన్సీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా ప్రతినెల 5వ తేదీ లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు, బస్తీ దవాఖానలో 2019 సంవత్సరాలలో కాంట్రాక్టు విధానంలో నియామకమైన సపోర్టింగ్ స్టాఫ్ ను ఏజెన్సీలకు అప్పజెప్పడాన్ని నిలుపుదల చేయాలని ఇట్టి సపోర్టింగ్ స్టాఫ్ ను కాంట్రాక్టు విధానంలో కొనసాగించాలని అన్నారు కేంద్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖలో రకరకాల స్కీముల పేరుట పనిచేస్తున్న వారందరినీ పర్మనెంట్ చేయాలని ప్రైవేటీకరణ విధానాన్ని వెంటనే ఆపాలని అన్నారు వెంటనే రెగ్యులర్ చేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో యన్ హెచ్ ఎం జిల్లా జాయింట్ సెక్రెటరీ ప్రమీల,సిబ్బంది తులసి, వనిత, మండల,అరికిల్ల స్వామి తోపాటు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం

**పద్మక్రాంతి, మే 08 (చేవెళ్ల- ప్రతినిధి):**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ వారితో కలిసి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని ఈ రోజు చెవెళ్ల మండలములోని కుమ్మెర మరియు గొల్లపల్లి గ్రామ పంచాయతి కార్యలయాలలో గురువారం నిర్వహించారు.ఈసందర్బంగా కుమ్మెర గ్రామంలో అసిస్టెంట్ ప్రొఫెసర్, డా. వి. రమ్య మాట్లాడుతూ యూరియా వాడకం తగించడం వల్ల నెల తల్లి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, పంట మార్పిడి చేయడం వలన చీడపీడలను తగించవచ్చన్నారు. డా. వి. కవితా కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ చెట్లను పెంచడం వలన పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవచ్చని వివరించారు. గొల్లపల్లి గ్రామంలో డా. యమ్. ప్రమీల, సినియర్ శాస్రవేత్త యూరియా తగించడం, రసాయనాలను అవసరాన్ని బట్టి వాడటంతో పాటు పుట్టగొడుగుల పెంపకం గురించి వివరించారు. శ్రీమతి. సిహెచ్. స్నేహలత, అసిస్టెంట్ ప్రొఫెసర్, పోషక అహరం ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. యస్. శంకర్ లాల్, చెవెళ్ల మండల వ్యవసాయ అధికారి ఆయిల్ పామ్ సాగు గురించి వివరించారు. వ్యవసాయ విస్థరణ అధికారులు బాలకోటేశ్వర్ మరియు ప్రతిభ రైతు నమోదు గురించి మాట్లాడారు. ఈ రెండు కార్యక్రమాలో రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. టి. కరుణాకర్, గ్రామ పంచాయతి కార్యదర్శి మరియు విద్యార్థులు, కె. రాజేష్, యమ్. అపూర్వ, యస్. కౌశల్య, కె. గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల అభిప్రాయ సేకరణ క్యూఆర్ కోడ్ స్కాన్‌లో ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా బాలానగర్ ఎంపిక

**పద్మక్రాంతి, మే 8, కూకట్ పల్లి, ప్రతినిధి**




పౌరులకు మెరుగైన సేవలను అందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ ఎన్నో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా పోలీసశాఖ గురించి, స్టేషన్లలోని సిబ్బంది గురించి ప్రజలేమనుకుంటున్నారు, పోలీస్ స్టేషన్లలో ప్రజలకు సరైన ఆదరణ లభిస్తోందా? ఫిర్యాదుదారులతో సిబ్బంది ఏ విధంగా ప్రవర్తిస్తున్నారు? అనే విషయాలు తెలుసుకోవడానికి పోలీస్ శాఖ ఇటీవల కొత్త ప్రయత్నం క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ విధానాన్ని చేపట్టింది. ఇటీవల ఈ ఫీడ్ బ్యాక్ ఆధారంగా డీజీపీ ఆఫీస్ ప్రతినిధులు రాష్ట్ర పరదిలో 10 ఉత్తమ పోలీస్ స్టేషనలను ఏమిపిక చేశారు. అందులో భాగంగా సైబరాబాద్ కమీషనరేట్ పరధిలోని బాలానగర్ పోలీస్ స్టేషన్ ఉత్తమ పోలీస్ స్టేషన్‌గా ఎంపికైందని సీఐ నర్సింహా రాజు పత్రిక ప్రకటనలో గర్వాంగా తెలిపారు. ఈ సందర్భంగా బాలానగర్ సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ, తమ పనితీరును స్వయంగా తెలుసుకుని మెరుగు పరుచ కోవాలని అందుకు ప్రజల అభిప్రాయం తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్?ను ప్రవేశపెట్టినట్టు సీఐ పేర్కొన్నారు. రాష్ట్రంలో 9వ స్థానం సాధించినందుకు స్థానిక ప్రజలకు, సిబ్బందికి, ప్రజలు తమ పై ఉంచిన నమ్మకాన్ని, ఆధరణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ యొక్క ఘనత సాధించడంలో సైబరాబాద్ సిపి, బాలానగర్ డీసీపీ, ఏడీసీపీ, ఏసీపీ, ఇతర ఉన్నత అధికారుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. దీనికి సంబంధించి ఈ నేల 17వ తేదీన డీజీపీ కార్యాలయంలో బహుమతి పురస్కారం ఉందని అన్నారు. పోలీసుల సేవలపై ప్రజల అభిప్రాయ సేకరణలో క్యూఆర్ కోడ్‌ను ప్రజలు స్కాన్ చేస్తే ఇంగ్లిషు, తెలుగులో పోలీసుల గురించి పలు ప్రశ్నలకు సమాధానాలు టైప్ చేసి పంపవచ్చు లేదా వాయిస్ ద్వారా అయినా సమాధానం ఇవ్వవచ్చు. ఈ ఫీడ్ బ్యాక్ ఆధారంగా పోలీస్ శాఖపై ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడం ప్రభుత్వ ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఆయా పోలీస్ స్టేషన్ల పనితీరుపై ర్యాంకులు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.



# మున్సిపాలిటీలకు కొత్తగా 453 మంది ఇంజనీరింగ్ అధికారులు

**ఇంచార్జ్ అధికారులతోనే ప్రస్తుతం పనులు చేయిస్తున్నాం**

**ఎఇ, డిఇ, ఇఇ, ఎస్ఇ స్థాయి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నాం.**

**అనిరుధ్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం లిఖిత పూర్వక సమాధానం.**

**వెల్లడించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**పద్మక్రాంతి, మే 8, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :**

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపాలిటీలలో కొత్తగా 453 ఇంజనీరింగ్ అధికారుల నియామకానికి చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు అసెంబ్లీలో తాను అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో 62 మున్సిపాలిటీలో ఉంటే గత పదేళ్ల కాలంలో వాటి సంఖ్య 152 కు పెరిగిందని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త మున్సిపాలిటీలనైతే ఏర్పాటు చేసింది గానీ వాటిలో పని చేయడానికి అవసరమైన కమీషనర్లు, ఇంజనీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారుల పోస్టులను మాత్రం మంజూరు చేయలేదని గురువారం మీడియాకు వెల్లడించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలంలో ఏర్పాటు చేసిన 42 కొత్త మున్సిపాలిటీలు కమీషనర్లు, ఏఇఇలు, టీపీఓలు మంజూరు చేయలేదన్నారు. అడ్మినిస్ట్రేషన్ చూసుకోవడానికి కమీషనర్లు, మున్సిపాలిటీలకు మంజూరయ్యే అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి ఇంజనీరింగ్ అధికారులు, పట్టణాల ప్రగతికి అవసరమైన అనుమతులు ఇచ్చే టౌన్ ప్లానింగ్ అధికారులు లేకపోతే మున్సిపాలిటీలు ఎలా అభివృద్ధి చెందుతాయని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది అక్టోబర్ నెలలో ఈ మున్సిపాలిటీలకు అవసరమైన కమీషనర్ పోస్టులను మంజూరు చేసి వాటికి సంబంధించిన నియామకపు ప్రక్రియ చేపట్టిందన్నారు. కమీషనర్లతో పాటుగా టౌన్ ప్లానింగ్ అధికారుల అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం 165 మంది టౌన్ ప్లానింగ్ అధికారులను నియమించిందని వివరించారు. ప్రస్తుతం ఒక్కో ఏఇఇ 6 మున్సిపాలిటీలకు ఇంచార్జీలుగా పని చేస్తున్నారని, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మొత్తం 21 మున్సిపాలిటీలు ఉంటే 21 మున్సిపాలిటీలకు కలిపి ఇద్దరు డిఇఇ లే ఉన్నారని, అలాగే 21 మున్సిపాలిటీలకు కలిపి కేవలం ఒకే ఒక్క ఇఇ ఉన్నారని వెల్లడించారు. ఒక ఇఇ 21 మున్సిపాలిటీల్లో జరిగే పనులను పర్యవేక్షించడం సాధ్యమౌతుందా? అని ప్రశ్నించారు. ఇక రాష్ట్రం విషయాని కొస్తే 5 ఉమ్మడి జిల్లాలకు కలిపి ఒక ఎస్ఇ ఉన్నారని, ప్రస్తుతం సౌత్ కు ఒకరు, నార్త్ కు ఒకరు చొప్పున రాష్ట్రంలో కేవలం 2 ఎస్ఇ లు మాత్రమే పబ్లిక్ హెల్త్ లో పని చేస్తున్నారని వివరించారు. ఇక ఎస్ఇ తర్వాత సిఇ పోస్టులు మంజూరు కాలేదని, ఒక ఇ.ఎన్.సీ. మాత్రం ఇంచార్జ్ గా పని చేస్తున్నారని అనిరుధ్ రెడ్డి వివరించారు. ఈ నేపథ్యంలోనే తాను అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం లిఖిత పూర్వక సమాధానం ఇచ్చిందన్నారు. ఏఇఇ, డిఇఇ, ఇఇ, ఎస్ఇ స్థాయిల్లో 453 ఇంజనీరింగ్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించిందని అనిరుధ్ రెడ్డి వివరించారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి మున్సిపాలిటీల అభివృద్ధికి దోహదపడాలని ప్రభుత్వాన్ని కోరారు.



# జర్నలిస్ట్ ఇంటిపై సోదాలు చేయడం సరికాదు

**దేవరకద్ర, మే 8 పద్మ క్రాంతి**



సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న జర్నలిస్టు ఇంటిపై సోదాలు చేయడం సరికాదని దేవరకద్ర జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు షఫీ ఉపాధ్యక్షులు ఎల్లప్ప సరికాదని అన్నారు. గురువారం దేవరకద్ర పట్టణ కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై ఎలాంటి అనుమతులు లేకుండా సోదాలు చేయడం ప్రజాస్వామ్య పద్ధతి కాదన్నారు. జర్నలిస్టు ఇంటిపై సోదాలు చేసి పత్రిక స్వేచ్ఛను హరిస్తున్నారని పేర్కొన్నారు. ఐ జర్నలిస్టుల ఇళ్లపై మరోసారి దాడులు చేస్తే పోరాటాలు చేస్తామని అన్నారు. జర్నలిస్టు కుటుంబానికి ప్రతి జర్నలిస్టు అండగా ఉండి నిరసన వ్యక్తం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘం గౌరవ అధ్యక్షులు రమేష్ చారి, ప్రాణేష్ చారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి మల్లికార్జున్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# అధైర్య పడొద్దు అండగా ఉంటాం

**కార్యకర్తల చేత సహాయం చేసిన ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి**



**పద్మక్రాంతి, మే 8, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/మిడ్జిల్ :**

ఊర్కొండ మండల కేంద్రానికి చెందిన నేరళ్లపల్లి రాములు గత 10 రోజుల క్రితం ప్రమాదంలో మృతి చెందారు. బిజెపి పార్టీ మండల నాయకుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కరాటి అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు. బిజెపి పార్టీ నాయకుల ద్వారా రూ. 5000 కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్ కుమార్, బండి మల్లేష్, కొమ్ము శ్రీను, ఆంజనేయులు, వార్డు సభ్యులు ఆంజనేయులు, లక్ష్మయ్య, కుమార్, మహేష్, సుధాకర్, శేఖర్, నరేష్, రమేష్, కుటుంబ సభ్యులు ఉన్నారు.

# నంది వనపర్తిలో ఆయుర్వేద వైద్య శిబిరం



**పద్మక్రాంతి, మే 8 (యాచారం):**

మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఆయుర్వేద వైద్యురాలు ఇందిరా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. వాతం ,మోకాళ్ల నొప్పులు , చర్మ వ్యాధులు ,స్త్రీ వ్యాధులకు సంబంధించిన మందులు పంపిణీ చేశారు.దాదాపు 117 మంది రోగులకు షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..ప్రతి నెల రెండో గురువారం ,నాలుగో గురువారం నంది వనపర్తి లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అటెండర్ డి .రాములు,ఆశా వర్కర్లు సువర్ణ,సైదమ్మ ,సావిత్రి,కారో బార్ మహేందర్ , కొండూరు శేఖర్ , రాంరెడ్డి, కాలే యాదయ్య , బేగరి పాపయ్య ,గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.

# యాచారం మండలం ఐఎన్‌టియుసి అధ్యక్షునిగా కొమ్ము సురేష్

**పద్మక్రాంతి, మే 8(యాచారం):**

యాచారం మండలం చౌదర్పల్లి గ్రామానికి చెందిన కొమ్ము సురేష్ ని యాచారం మండలం ఐ ఎన్ టి యు సి అధ్యక్షునిగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఇన్చార్జ్ పాలకూర్ల ఐలేష్ గౌడ్ ఈ సందర్భంగా కొమ్ము సురేష్ మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ స్టేట్ సేవాదళ్ ఉపాధ్యక్షుడు మంకాల దాసు , డిసిసి ప్రధాన కార్యదర్శి ముచ్చర్ల సంపత్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌదర్పల్లి మాజీ ఎంపిటిసి రాజేందర్ రెడ్డి, గ్రామ శాఖ ఉపా ధ్యక్షుడు కంబాలపల్లి కృష్ణ, గ్రామ శాఖ జనరల్ సెక్రెటరీ అమీర్పేట్ బుగ్గ రాములు , అఖిల్ ఖాన్, కొమ్ము యాదయ్య, రామకృష్ణ, తిప్పర్తి రాములు, సుధాకర్ , ఇబ్రహీంపట్నం ఎమ్మార్పీఎస్ ఇన్చార్జి సిద్దాపురం శ్రీకాంత్ ప్రభాస్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



# యాచారం మండల ప్రత్యేక అధికారిగా మాధవరావు

**పద్మక్రాంతి, మే 8(యాచారం) :**



మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా మాధవరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీలత, ఏపీవో లింగయ్య, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. తథానంతరం ప్రత్యేక అధికారి మాధవరావు ఇంచార్జ్ ఎంపీడీవో శైలజ ఆధ్వర్యంలో, ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు రాజీవ్ యువ వికాసం, మండలంలో జరుగుతున్న పనుల పై అధికారులతో సమీక్షించారు. పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీ ఓ శ్రీలత, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

# ఎల్‌ఓసి వెంబడి పాకిస్తాన్ కాల్పుల్లో జవాన్ వీరమరణం

శ్రీనగర్: జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఓసి) వెంబడి పాకిస్తాన్ సైన్యం జరిపిన భారీ కాల్పుల్లో ఒక జవాన్ వీరమరణం పొందారు. 5 ఫీల్డ్ రెజిమెంట్‌కు చెందిన లాన్స్ నాయక్ దినేష్ కుమార్ కూడా వీరమరణం పొందారు. వైట్ నైట్ కార్ప్స్ ఈ సమాచారాన్ని విడుదల చేసింది. సరిహద్దు దాడులతో బాధపడుతున్న పౌరులకు కార్ప్స్ సంఘీభావం తెలిపింది. మే 6 రాత్రి నుండి పూంచ్, తంగ్ధర్ మరియు ఇతర సరిహద్దు ప్రాంతాలలో పాకిస్తాన్ సైన్యం కాల్పులు జరపడం ప్రారంభించింది. తీవ్రమైన కాల్పుల్లో ఇళ్లకు భారీ నష్టం వాటిల్లింది. ఆ ప్రాంతం నుండి అనేక మందిని తరలించారు. దాడిలో అనేక మంది గాయపడ్డారు. గాయపడినవారు ప్రస్తుతం వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ సిందూర్ ప్రారంభించిన తర్వాత కూడా, పాకిస్తాన్ బుధవారం కాల్పుల విరమణను ఉల్లంఘించడం కొనసాగించింది. మరిన్ని జనావాస ప్రాంతాలపై దాడి జరిగింది. పహల్గామ్‌లోని బైసరన్‌లో 26 మందిని బలిగొన్న ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా భారత్ సైన్యం ఆపరేషన్ సిందూర్ జరిపారు. అందుకు ప్రతిగా పాక్ సాయుధ దళాలు నియంత్రణ రేఖ వెంబడి ఉన్న గ్రామాలపై పెద్ద ఎత్తున కాల్పులకు తెగబడ్డాయి.

# మిడ్జిల్ తహసిల్దార్‌ను సస్పెండ్ చేయాలి : బిజెపి డిమాండ్

**పద్మక్రాంతి, మే 8, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్:**



మిడ్జిల్ మండలంలో అక్రమంగా ఇసుక, ఎర్ర మట్టిని తరలింపుకు కెనాల్ మొరం అమ్ముకుంటున్న మాఫియాకు మిడ్జిల్ తహసిల్దార్ సహకరిస్తున్నాడని బీజేపీ నాయకులు ఆరోపించారు. ఆయనను వెంటనే సస్పెండ్ చేసి విచారణ జరిపించాలని మిడ్జిల్ మండల బీజేపీ ఆధ్వర్యంలో తహసిల్దార్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, బిజెపి నాయకులు బుచ్చయ్య, వెంకట్, వెంకట్ రెడ్డి, వాసుదేవ్, గుమ్మకొండ శ్రీనివాసులు, సంపంగి నరేష్, జంగయ్య, ఆంజనేయులు, వడ్డే తిరుపతయ్య, పరశురాములు, చంద్రశేఖర్ అరవింద్, నవీన్, రైతులు పాండు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

# ఇసుక తవ్వకాలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయి

**తవ్వకాలను ఆపే అధికారం మాకు లేదు**

**మిడ్జిల్ మండల తహసీల్దార్ పులి రాజు వెల్లడి**



**పద్మక్రాంతి, మే 8, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :**

కొత్తపల్లి గ్రామంలోని భూముల్లో ప్రభుత్వం ఇసుక తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని తనకు ఇసుక అనుమతులను ఆపడానికి అధికారం లేదని మిడ్జిల్ మండల తహసీల్దార్ పులి రాజు తెలిపారు. గురువారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఇసుక దుందుభి వాగునుంచి ఎవ్వరు తవ్వడం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న రహదారి గత 12 ఏళ్ల పైబడిగా ఈ రహదారి నిర్మితమై ఉందని, ఆరహదారి గుండా వాహనాలు వెళ్లవచ్చాన్నారు. వీటిని ఆపే హక్కు ఎవరికి లేదని పేర్కొన్నారు. రహదారి ని రైతులు కూడ ఉపయోగించుకోవాలని చెప్పారు. కొత్తపల్లి పట్టా భూములకు సంబంధించి ఇసుక పర్మిషన్లకు సంబంధించిన ఏమైనా అభ్యంతరాలు ఉంటే పైఅధికారులను సంప్రదించవచ్చన్నారు.

# ఘనంగా "మేకల శ్రీనివాస్ గౌడ్" జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన పలువురు కాంగ్రెస్ నేతలు,డివిజన్ నాయకులు**





**మేడిపల్లి,పద్మక్రాంతి:**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్ఐఎన్ కాలనీ అధ్యక్షుడు కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల శ్రీనివాస్ గౌడ్ జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు,డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొని మేకల శ్రీనివాస్ గౌడ్ ను ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో భవిష్యత్తులో మరింత రాజకీయ ఉన్నతిని సాధించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మిత్రులకు,శ్రేయోభిలాషులకు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మేకల శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజాస్వామ్యంపై పోలీసుల దాడి

**పద్మక్రాంతి, మే 8, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్:**





విజయవాడ సాక్షి ఎడిటర్ పై పోలీసులు దాడి చేయడం ప్రజాస్వామ్యం పై దాడి చేయడమే నని మిడ్జిల్ ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభంగా ప్రజా సమస్యలు వెలికి తీసి పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టులపై దాడి చేయడం విచారకరమని అన్నారు. పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం బాధాకరమన్నా రు. సమాజంలో తప్పుచేసిన వారిని గుర్తించి చట్ట ప్రకారం శిక్షించేందుకు ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రత్యేకించి చట్టాల రూపకల్పన చేశాయని ఇందుకోసం కోర్టులు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. కారణం లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయ రెడ్డి పై దాడి చేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మిడ్జిల్ మండల కేంద్రంలో జర్నలిస్ట్ గౌరవ అధ్యక్షుడు బరిగెల వెంకటయ్య ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డు పై నిరసన వ్యక్తం చేసి, స్థానిక ఎమ్మెల్యే జన%శీ%పల్లి అనిరుద్ రెడ్డికి జర్నలిస్టుల ఆధ్వర్యంలో విడుదపత్రం అందజేశారు.

# వి'జయహో భారత్






**బోడుప్పల్లో "ఆపరేషన్ సింధూర్" బిజెపి సక్సెస్ ర్యాలీ**

**ప్రధాని నరేంద్ర మోడీకి సైన్యాధిపతులకు కృతజ్ఞతలు**

**మేడిపల్లి,పద్మక్రాంతి:**

ఏప్రిల్ 22న కాశ్మీర్ పహేల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు అమానవీయంగా చేసిన దాడికి బదులుగా మే 7వ తేదిన ఉగ్రవాదుల స్తావరాలపై "ఆపరేషన్ సింధూర్" పేరిట మన దేశం చేసిన ధీటైన ప్రతిచర్య విజయవంతమైన సందర్భంగా భారత సాయుధ దళాలకు,భారత సత్తా ప్రపంచానికి తెలిపే విధంగా నిర్ణయం తీసుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలుపుతూ బోడుప్పల్ బిజెపి శ్రేణులు వివేకానంద నగర్ కాలనీలోని వివేకానంద విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు హిందుస్థాన్ జిందాబాద్,పాకిస్తాన్ డౌన్ డౌన్..ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేస్తూ జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిజెపి కార్యవర్గ సభ్యులు తుప్పత్ ఆనంద్, సిల్లువేరు శంకర్,కొల్లపూడి విజయ్,భానుకుంట వేణు,వెంకటేష్,మురళీధర్, జై కిషన్, రాజి రెడ్డి, రాజు,బోడుప్పల్ నగర్ ఆర్ఎస్ఎస్ కార్యవాహ రామిరెడ్డి, పోతంశెట్టి శ్రీధర్,సిలివేరు నరసింహ, మంద జగన్నాధం,శంకర్ రెడ్డి, వీరప్రతాప్ యాదవ్, మాధవ రెడ్డి, బాలరాజు, వెంకట్ రెడ్డి, పాండు చారీ, జోషి పురుషోత్తం, కిష్టయ్య, విజయలక్ష్మి, రాజి రెడ్డి,రాంరెడ్డి, తుల్జారాం, దేశిక్ చంద్ర, ఝాన్సీ శ్రీ పాల్గొనడం జరిగింది.

# జిల్లా వ్యాప్తంగా పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీడి. జానకి, ఐపీఎస్**

**పద్మక్రాంతి, మే 8, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :**



జిల్లా వ్యాప్తంగా పోలీసులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ తెలిపారు. జిల్లా ఎస్పీ నేతృత్వంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించి పలు ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు. దేశ సరిహద్దుల్లో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా మహబూబ్ నగర్ జిల్లాలో ముందస్తు భద్రత చర్యలు చేపట్టబడ్డాయన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు అప్రమత్తంగా విధుల్లో ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసుల సెలవులు రద్దు చేసి 24 గంటల పాటు విధుల్లో ఉండాలని సూచించారు. ప్రజలు ఎవ్వరు కూడా అనుచిత పోస్టులు, తప్పుడు సమాచారం ప్రసారం చేయొద్దని, దేశ భద్రత, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఏవైనా వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్ట్లు చేయడం నిషిద్ధమని, సోషల్ మీడియాలో పటిష్ట నిఘా కొనసాగుతుందన్నారు. చట్టానికి లోబడి వ్యవహరించి, అనుమానాస్పద వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గుర్తింపు లేకుండా ఉన్నవారికి లాడ్జిలలో వసతి కల్పించ వద్దన్నారు. డ్రగ్స్, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నిరోధించడంలో సహకరించాలన్నారు.

# పాకిస్తాన్ పై భారత సైనికులు చేస్తున్న పోరాటానికి అవేర్ మద్దతు

**భారతదేశ స్వతంత్ర పోరాటం గురించి వివరించిన చైర్మెన్ మాధవన్**

**మహేశ్వరం మే 8, (పద్మక్రాంతి ప్రతినిధి):**

ఆపరేషన్ సింధూర ప్రపంచంలో అన్ని దేశాలు మద్దతు తెలుపుతున్నదుకు గర్వంగా ఉందని అవేర్ చైర్మన్ మాధవన్ అన్నారు. పాకిస్తాన్ పై భారత సైనికులు చేస్తున్న పోరాటానికి 40 మంది అవేర్ సభ్యులు మద్దతు తెలుపుతూ ప్రసంగించారు. ఈ సమావేశానికి అవేర్ డైరెక్టర్ జనరల్ రాజ్యవర్ధన్ రెడ్డి అధ్యక్షత వహించారు భారతదేశ స్వతంత్ర పోరాటం గురించి పాకిస్థాన్ పుట్టుక గురించి అవేర్ చైర్మన్ మాధవన్ జి సభ్యులకు వివరించారు. ప్రధానమంత్రి చర్యలకు భారత ప్రభుత్వం తలపెట్టిన మన సైనికుల వీరోచిత పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటిస్తూ ఏ త్యాగానికైనా సిద్ధమని తెలిపారు. ఈ సదస్సు ప్రారంభానికి ముందు జాతీయ పతాకం ఆవిష్కరించి దేశభక్తి నినాదాలు చేశారు. ఈసమావేశంలో వెంకట రెడ్డి , వరుణ్, తరుణ్, రమాకాంత్, డా. ఇర్షాద్, డా. జాఫర్, డా. ప్రభాకర్, వెంకన్న, కె. గణేష్, రీనా, కళ పాల్గొన్నారు.





# రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్ నగర్, మే 8 (పద్మక్రాంతి ప్రతినిధి) :**

చౌదరిగూడ మండలంలోని రావిర్యాల గ్రామంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్ర కార్యక్రమంలో షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పాల్గొని గ్రామంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతతత్వ శక్తులు రాజ్యాంగాన్ని, అంబేద్కర్ ను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.అంబేద్కర్ రాసిన రాజ్యాంగం మూలంగా సమాజంలో అట్టడుగు స్థాయిలో ఉన్న ప్రతి పౌరుడు ఉన్నత స్థానానికి ఎదిగేందుకు అవకాశాలు కల్పించబడ్డాయి అని తెలిపారు. అందరికీ రాజ్యాంగ పరిరక్షణ నినాదం కాదని, ప్రతి ఒక్కరి బాధ్యత అని చాటి చెప్పడానికే దేశవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రావిర్యాల గ్రామంలో ఇప్పటికే 47 లక్షల నిధులను మంజూరి చేసి పనులు పూర్తి చేశామని తెలిపారు. దశలవారీగా అందరూ అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజు, కొందుర్గ్ మండల అధ్యక్షుడు కృష్ణా రెడ్డి,నందిగామ మండల అధ్యక్షుడు జంగ నర్సింహులు, మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్ రెడ్డి, అగ్గనూరు విశ్వం, కొంకళ్ళ చెన్నయ్య, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి,రోహిత్ రెడ్డి, కొమ్ము కృష్ణ,అందే మోహన్, ముబారక్ అలీ ఖాన్ , సీతారాం,తుపాకుల శేఖర్,మాజీ సర్పంచులు నర్సప్ప గూడ కృష్ణ, నర్సింహులు,స్థానిక నాయకులు నీలయ్య,శివ కుమార్, జంగయ్య,రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు..

# యూపీఎస్సీ, సిఎస్ఏటి 2025 ఉచిత శిక్షణ

**అర్హులైనవారు దరఖాస్తులు చేసుకోవాలి**

**జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కే. నవీన్ కుమార్ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా, మే 8, (పద్మక్రాంతి ప్రతినిధి):**

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కల్, మైనారిటీల సంక్షేమం శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ, సివిల్ సర్వీసెస్ 2025-26 ఉచిత శిక్షణ కు ఆన్లైన్ దురఖాస్తులను చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కే. నవీన్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గలవారు మే 1 నుంచి 24 వరకు వరకు ఆన్ లైన్ ద్వారా www.cet.cgg.gov.in/tmreis వెబ్సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దీంతో విద్యార్థుల తండ్రి యొక్క వార్షిక ఆదాయం రూ.5,00,000 లోపు ఉన్నవారు అర్హులు, ఎంపిక విధానములో రిజర్వేషన్ నియమం అమలవుతుంది. స్క్రీనింగ్ టెస్ట్ జూన్ 5 న నిర్వహిం చబడుతుందన్నారు. విద్యార్హతలు మొదలైన వివరములు, ఎంపిక విధానము పై వెబ్ సైట్ లో చూసుకోవాలని తెలిపారు. ఫోన్ నెంబర్ 040-23236112 సంప్రదించవచ్చని అన్నారు.

# మహిళలకు అండగా షీ టీమ్స్





### రాచకొండ సిపి జి.సుధీర్ బాబు, ఐపిఎస్
### గత నెల రోజుల్లో 188 మంది పోకిరీలను పట్టుకున్న రాచకొండ షీ టీమ్స్

**రంగారెడ్డి జిల్లా, మే 8, (పద్మక్రాంతి ప్రతినిధి):**

బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను రాచకొండ షీ టీమ్స్, పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తి లేదని, మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చని రాచకొండ కమిషనర్ జి. సుధీర్ బాబు,ఐపిఎస్ తెలిపారు. రాచకొండ ఉమెన్ సేఫ్టీ వింగ్, షీ టీమ్స్ ఆధ్వర్యంలో ఈవ్ టీజర్లకు రాచకొండ క్యాంప్ కార్యాలయంలో మహిళలను, యువతులను వేదింపులకు గురిచేస్తున్న 188 మేజర్స్ 132, మైనర్స్ 56 మందిని షీ టీమ్స్ పట్టుకున్న వారికి గురువారం ఎల్బి నగర్ సీపీ క్యాంపు కార్యాలయంలోని ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆఫీసులో వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాచకొండ సిపి జి.సుధీర్ బాబు, ఐపిఎస్ మాట్లాడుతూ.. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే, వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నామన్నారు. దీంతో వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తున్నారని పేర్కొన్నారు.

**మొత్తం 225 పిర్యాదులు..**

గత నెల ఏప్రిల్ 1 నుంచి 30 తేదీ వరకు అందిన ఫిర్యాదులలో ఫోన్ల ద్వారా వేదించినవి 26, సోషల్ మీడియాలో ఆప్స్ ద్వారా వేదించినవి 77. నేరుగా వేదించినవి 122 వచ్చాయన్నారు. వాటిలో క్రిమినల్ కేసులు 14, పెట్టి కేసులు 92 పెట్టామని తెలిపారు. వాటిలో 90 మందికి కౌన్సిలింగ్ ఇచ్చామని విమెన్ సేఫ్టీ వింగ్ డి.సి.పి టి. ఉషారాణి తెలిపారు.

**ముఖ్యమైన కేసులు ఇవే..**

యువతిపై లైంగిక దాడికి ప్రయతించిన వ్యక్తి పై కేసు షీ టీమ్ కు అందిన పిర్యాదు మేరకు ఒక యువతి ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ చదువుతూ అదే కాలేజీలోని హాస్టల్ లో ఉంటుంది. ఒక రోజు ఉదయం గం 10 గంటల సమయంలో డెంటల్ ట్రీట్మెంట్ కొరకు దగ్గరలో ఉన్న టౌన్లో వచ్చి, ట్రీట్మెంట్ చేయించుకొని, తిరిగి కాలేజీలోని హాస్టల్ కు వెళ్లడం కోసం బస్ స్టాండ్ లో నిల్చొని ఉండగా అట్టి సమయంలో వారి పక్క గ్రామస్తుడైన తెలిసిన వ్యక్తి ఆ యువతి దగ్గరికి వచ్చి కొద్ది సేపు మాట్లాడారు. హాస్టల్ లో డ్రాప్ చేస్తానని చెప్పగా, యువతి కుటుంబానికి తెలిసిన వ్యక్తి కాబట్టి ఆమె సరే అని అతనితో పాటు వెళ్ళింది. మార్గ మద్యలో కాఫీ తాగుదామని చెప్పి. బలవంతంగా రోడ్డు పక్కనే ఉన్న ఓయో రూమ్ కు సదరు యువతిని లాక్కోని వెళ్లాడు. నిందితుడు యువతిని బలాత్కారం చేస్తుండగా, ఇద్దరి మధ్య పెనుగులాట జరిగి ఆమెకు మెడ ముఖం పై గాయాలైనవి, చివరికి యువతి అతనిని తోసేసి అతని బారి నుంచి తప్పించుకొని రోడ్డు పైకి వచ్చింది. అదే సమయంలో రోడ్డుపై కారులో వెళ్తున్న దంపతులు యువతి పరిస్థితిని గమనించి, విషయం తెలుసుకొని ఆమెను కాలేజీ వద్ద డ్రాప్ చేశారు. అదే హాస్టల్ లో ఉన్న వారి అక్కకు జరిగిన విషయం చెప్పగా, వారు ఇట్టి విషయంపై షీ టీం వారిని సంప్రదించి పోలీస్ స్టేషన్ లో క్రిమినల్ కేసు నమోదు చేశారు.

**టెలిగ్రాం ద్వారా యువతిని వేధిస్తున్న వ్యక్తి అరెస్టు..**

షీ టీమ్‌కు అందిన పిర్యాదు మేరకు ఒక యువతి ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతుంది. ఆమె ఉండే ప్రాంతంలో నివసించే నిందితుడితో పరిచయం ఏర్పడినది. తరచుగా ఆమెతో మాట్లాడుతుండేవాడు. నిందితుడు మేసేజ్ చేయడం కొరకు యువతిని టెలిగ్రాం అప్ ఇన్ స్టాల్ చేసుకోవాలని చెప్పగా, ఆమె ఒప్పుకోలేదు. దీంతో అతనే ఆమె ఫోన్లో టెలిగ్రాం అప్ ఇన్ స్టాల్ చేసి, తర్వాత ఆ యాప్ లో ఆమె ప్రైవేట్ పార్ట్స్ చూపించమని వల్గర్గా మెసేజ్లు పంపిస్తూ ఇబ్బంది పెట్టాడు. ఇట్టి విషయంపై షీ టీం వారిని సంప్రదించగా పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి జైలుకు తరలించామని తెలిపారు.

**ప్రేమ పేరుతో యువతిని వేదిస్తున్న వ్యక్తి అరెస్టు..**

షీ టీమ్‌కి అందిన పిర్యాదు మేరకు ఒక యువతి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతుండగా, ఆసమయంలో నిందితుడు యువతికి ప్రేమిస్తున్నానని ప్రపోజ్ చేయగా, ఆమె అంగీకరించలేదు. ఇలా గత రెండు సంవత్సరాలుగా వేదిస్తూన్నాడు. ఆమెకు ఆమెకు తెలియకుండా ఆమె ప్రొఫైల్ ఫోటోలు తీసుకొని మర్ఫింగ్ చేసి వాటిని సోషల్ మీడియాలో పెడుతానని యువతిని వేదించాడు. దీంతో యువతి షీ టీం వారిని సంప్రదించగా పోలీస్ స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపించామన్నారు.

**ప్రేమించమంటూ వేదింపులకు గురిచేస్తున్న వ్యక్తి అరెస్టు..**

షీ టీమ్ కు అందిన పిర్యాదు మేరకు ఒక యువతి డిగ్రీ చదువుతుంది. ఆమెతో పాటు చదివే వ్యక్తి గత రెండు సంవత్సరాలుగా ప్రేమించమని వెంటపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. సదరు యువతి ఎంత చెప్పిన వినకుండా అలాగే వెంటపడేవాడు, అంతే కాకుండా అసభ్య పదజాలంతో ఆమెకు మెసేజ్లు పంపిస్తూ వేదిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన యువతికి షీ టీమ్ ని సంప్రదించగ నిందితున్ని అదుపులోకి తీసుకొని, పోలీసు స్టేషన్ నందు క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేశామని చెప్పారు.

**బస్ స్టాండ్ లో న్యూసెన్స్ పోకిరీలు అరెస్టు..**

బస్ స్టాండ్ వద్ద న్యూసెన్స్ చేస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే స్పందించిన షీ టీమ్ అక్కడికి చేరుకొని న్యూసెన్స్ చేస్తున్నా ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారిపై పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేశారు.

**అవగాహన కార్యక్రమాలు :**

గత నెల 1 నుండి 30 తేదీవరకు షీ టీమ్స్ రాచకొండ మొత్తం 93 అవగాహన కార్యక్రమాలు నిర్వహించగా, దాదాపు 17420 మందికి మహిళా చట్టాలు, వారి యొక్క హక్కులు, నేరాలు మరియు జాగ్రత్తల గురించి వివరించి అవగాహన కల్పించారు.

**మెట్రో రైల్ డెకాక్ ఆపరేషన్స్..**

రాచకొండ షీ టీమ్స్ మెట్రో రైళ్లలో డెకాయ్ ఆపరేషన్సు నిర్వహించారు. మహిళా కంపార్మెంట్లోకి వెళ్ళి ప్రయాణిస్తున్న 9 మంది పురుషులను పట్టుకుని మెట్రో స్టేషన్ అదికారుల ద్వారా ఫైన్ వేశామని చెప్పారు. మహిళలు వేదింపులకు గురైనప్పుడు షి టీం రాచకొండ వాట్సాప్ నెంబర్ 8712662111 ద్వారా లేదా ఆ ప్రాంత షీ టీమ్ అధికారుల నంబర్లు బోనగిర్ ఏరియా 8712662598, చౌటుప్పల్ ఏరియా 8712662599, ఇబ్రాహీం పట్నం ఏరియా 8712662600, కుషాయిగూడ ఏరియా 8712662601, ఎల్బీనగర్ ఏరియా 8712662602, మల్కాజిగిరి ఏరియా 8712662603, వనస్థలిపురం ఏరియా 8712662604 లకు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో ఇన్ స్పెక్టర్లు ఎం.ముని, జె. హనుమంతు, జి. అంజయ్య, అడ్మిన్ ఎస్ఐ రాజు, షీ టీమ్స్ సిబ్బంది, కౌన్సిలింగ్లు పాల్గొన్నారు.

# జనరల్ స్టోర్స్‌లా ఆర్ఎంపీ క్లినిక్‌లు







### వారికి అర్హత అవసరం లేదు
### ఆపరేషన్లైనా చేస్తారు.. సెలైన్లు ఎక్కిస్తారు
### హైడోస్ మందులు ఇస్తారు
### అడిగే వారెవరు లేరు
### డీఎంహెచ్ఓ కు తాయిలాలు సమర్పిస్తే చాలు
### పేరుకే తనిఖీలు.. పైసలిస్తే చర్యలు ఉండవు
### యాదాద్రి భువనగిరి జిల్లాలో విస్తుగొల్పుతున్న వైద్య ఆరోగ్యశాఖ తీరుపై పద్మక్రాంతి ప్రత్యేక కధనం

**పద్మక్రాంతి, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:**

వ్యాది బారినపడ్డ రోగులకు ఏ చికిత్స అందించాలో వారికి అవసరం లేదు. ప్రజారోగ్యంతో పనే లేదు. అది ఏ రోగమైనా కానీ మొదలు ఒక ఎర్ర సూది.. ఒక నింబోలు సూది ఇచ్చి పైసలు గుంజినంక లెక్క.. ఇది ఆర్ఎంపీల నిత్యకృత్యం.. గల్లి గల్లికో క్లినిక్ ఏర్పాటు చేసి ముందు ఫస్ట్ ఎయిడ్ సెంటర్ బోర్డు ..లోపల కార్పొరేట్ డాక్టర్లు చేసే వైద్యం కంటే ఇంకా ఎక్కువగానే వైద్యం చేస్తారు. అవుట్ పేషెంట్ మొదలుకొని ఆపరేషన్ ధియేటర్ వరకు అన్నీ నడిపిస్తారు. ఎవరైనా అడిగితే పలానా ఎంబీబీఎస్ డాక్టర్ తమ ఆసుపత్రికి వచ్చి చికిత్స చేస్తాడని చెబుతారు. కానీ ఆ డాక్టర్ కు వీరికి అసలు సంభందం ఉండదని తెలుస్తుంది. రోగులకు ఇలా వచ్చి రాని వైద్యం చేస్తూ భారీగా డబ్బు గుంజుతున్నట్లు తెలుస్తుంది. ఎవరైనా చెకింగ్ వస్తే కుక్కకు బిస్కెట్ వేసినట్లు ఇలా ఓ డబ్బు కట్ట పారేస్తారు. మళ్ళీ అంతా కామన్.. గాయాలతో వచ్చినవారికి కట్లు కట్టడం ఫస్ట్ ఎయిడ్ చేయడం వరకే పరిమితం కావాల్సి ఉన్న ఆర్ఎంపీలు. పెన్నుతో ప్రిస్కిప్షన్ రాయడం ఉండదు. అయినా రోగికి అవసరం లేని భవిష్యత్తు ప్రమాదం ఉన్న యాంటి బయాటిక్ మందులు పెద్ద మొత్తంలో ఇస్తూ ప్రజల ఆరోగ్యం చెడిపోయేలా చేస్తున్నారని విమర్శలు ఉన్నాయి.. అత్యధిక మోతాదు ఉన్న మందులు సత్వర ఉపశమనం కలుగుతుండటంతో రోగులు వాడుతున్నారు. భవిష్యత్తులో అధికంగా యాంటిబయోటిక్స్ వాడడం వలన కిడ్నీలపై భారం పడి ప్రాణాలు కోల్పోతారని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆర్ఎంపీలు తమ క్లినిక్ లో బెడ్లు ఏర్పాటు చేసి రోగులకు సెలైన్ ఎక్కిస్తున్నారు. పెషంట్ పరిస్థితి విషమం అయితే తమకు తెలిసిన హాస్పిటల్ కు తరలిస్తున్నారు. ఇటీవల తుర్కపల్లి మండల కేంద్రంలో ఒక ఆర్ఎంపీ డాక్టర్ ట్రాన్సిల్స్ ఆపరేషన్ ను పేషెంట్ ను కుర్చీలో కూర్చోబెట్టి వైద్యం చేయడంతో పరిస్థితి విషమించింది. వెంటనే ఉప్పల్ లోని స్పార్క్ ఆసుపత్రికి తరలించి పేషెంట్ వైద్యానికి, మందులకు తానే చెల్లించినట్లు పేషెంట్ తెలపడంతో వివాదస్పదమైంది.

**తూతూ మంత్రంగా తనిఖీలు..**

ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ నిభందనలకు వ్యతిరేఖంగా ఆర్ఎంపీలు వైద్యం అందిస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల జిల్లాలోని పలు ఆసుపత్రులు, స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేసారు. కానీ వాటిలో నిబంధనలకు విరుద్ధంగా ఎన్నో లోపాలు ఉన్నా షోకాజు నోటీసులు ఇచ్చి జేబులు నింపుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా చట్టవిరుద్ధంగా భువనగిరి పట్టణంలో నిత్యం ఎన్నో లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు తెలుస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కాసులతో కళ్లు మూసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు పట్టిన డబ్బు జబ్బు ను తొలగించుకొని నిబంధనలకు వ్యతిరేకంగా చికిత్స చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పిన ఆర్మీ జవాన్లకు సలాం



**పద్మక్రాంతి, మే8, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :**

మిడ్జిల్ మండలకేంద్రంలో గాంధీ విగ్రహం దగ్గర నుం%ఎష్ట్రఱ% అంబేద్కర్ చౌరస్తా వరకు రాజకీయ అఖిలపక్షం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సింధూర పేరుతో ఉగ్రవాద నిర్మూలనే లక్ష్యంగా భారతీయ సాయుధ దళాలు జరుగుతున్న దాడులను చూస్తుంటే చాలా గర్వంగా ఉందని కాంగ్రెస్ నాయకుడు బరిగెల వెంకటయ్య తెలిపారు. అప్పుడే ఉగ్రదాడిలో అమాయకుల ప్రాణాలు తీయడం ఎంతో బాధాకరమన్నారు. కేంద్రం సహకారంతో దెబ్బకు దెబ్బతీసిన ఆర్మీ జవానికి సలాం చేశారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో పాకిస్తాన్ స్థావరాలని ధ్వంసం చేసిన ఆర్మీ జవాన్లను మెచ్చుకున్నారు. ఎంతో సాహసపెతంగా ఆర్మీ జవాన్లు చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో గొప్పదని, కోట్ల మంది భారతీయులు భారత్ వెంట అండగా నిలుస్తారని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో భారతదేశం వైపు చూడాలన్న ఉగ్రవాద సంస్థ భయపడే స్థితిలో ఉంతుందన్నారు. ఎన్నో అక్రమాలు చేసిన పాకిస్తాని వదిలిపెట్టాం ఇప్పటినుంచి వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఖబర్దార్ పాకిస్తాన్ ద్రోహుల్లారా, భారతదేశంలో ఉండి కూడా పాకిస్తాన్ కి వత్తాసు పలికే వారికి రేపు రాబోయే రోజుల్లో భారతదేశం నుండి వెళ్ళగొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో మిడ్జిల్ ఎస్ఐ శివ నాగేశ్వర్ నాయుడు, కాంగ్రెస్ జిల్లా నాయకులు, బీజేపీ జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, బిజెపి, కాంగ్రెస్ కార్యకర్తలు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం బ్యాంకుల ద్వారా ఇంటర్వ్యూలు



**పద్మక్రాంతి, మే 8, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :**

ఉర్కొండ మండలంలోనిమాదారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక కొరకు మండల స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగింది. ఈ ఇంటర్వ్యూలకు మాదారం, గుడిగానిపల్లి, రాచాలపల్లి, రేవల్లి, తిమ్మన్నపల్లి గ్రామాలనుండి 175 దరఖాస్తుదారులు హాజరు కావడం జరిగింది. ఇంటర్వ్యూలు నిర్వహించిన వారిలో మండల ప్రత్యేక అధికారి యం. శ్రీనివాసులు, ఎంపీడీఓ కృష్ణయ్య, యుకో బ్యాంకు మేనేజర్ హరిశ్చంద్ర ప్రసాద్, ఎంపీఓ లక్ష్మణ్, ఏపీఎం సంతోష్, సి కార్పొరేషన్ అధికారులు రామకృష్ణ, వెంకటేష్, రవికుమార్, ఖాజా ఎంపీడీఓ కార్యాలయ%శీ% ఊర్కొండ సిబ్బంది, రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

# ఈ నెల 16న పిల్లలమర్రిని సందర్శించనున్న ప్రపంచ సుందరిమణులు

### పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
### జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**పద్మక్రాంతి, మే8, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో/ మిడ్జిల్ :**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల మే 16న వివిధ దేశాలకు చెందిన ప్రపంచ సుందరీమణుల కంటెస్టెంట్స్ ఈనెల 16న మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం పిల్లల మర్రిని సంబంధిత శాఖల అధికారులు సమష్టిగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ వి జయేందిర ఆదేశించారు. గురువారం పిల్లల మర్రిలో అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో చేయు ఏర్పాట్లను పరిశీలించారు. సమర్థ నిర్వహణకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మిస్ వరల్డ్ కంటెస్టెంట్ లు సుమారు 750 సంవత్సరాల చరిత్ర గల, పిల్లలమర్రి వృక్షం, అక్కడే ఉన్న పురావస్తు మ్యూజియం, మ్యూజియం పక్కనగల రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంను సందర్శనున్నారు. పర్యాటక ప్రాంతం వద్ద స్వాగత ఏర్పాట్లు, సౌండ్ అండ్ లైటింగ్, ఏర్పాటు, తగినంత వెలుతురు, పటిష్ట భద్రత, పారిశుద్ధ్య నిర్వహణ, పార్కింగ్ తదితర ఏర్పాట్ల నిర్వహణకు అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఎస్పి డి. జానకి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్.పి. రాములు, డి.ఎస్.పి. వేంకటేశ్వర్లు, డి.ఎఫ్.ఓ సత్యనారాయణ, డిఆర్ డి ఓ నరసింహులు, నగరపాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, ఆర్డీవో నవీన్, డి.ఈ.ఓ ప్రవీణ్ కుమార్, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పద్మక్రాంతి
తెలుగు దినపత్రిక

# ఈ రూమర్ ఎక్కడ పుట్టింది



ఎంత పెద్ద స్టార్ అయినా రాజమౌళి సినిమాలో నటించేటప్పుడు వేరే ఆలోచనలు చేయడం, ఇతర స్క్రిప్ట్ లు వినడం కానీ చేయరు. ఇదేమి జక్కన్న కండీషన్ కాకపోయినా ప్రాజెక్ట్ లో జరిగే ఆలస్యంతో పాటు ఇతర విషయాల పట్ల డైవర్షన్ రాకూడదనే ఉద్దేశంతో హీరోలు వేరే నెరేషన్లకు దూరంగా ఉంటారు. చాలా అరుదుగా మినహాయింపు లభిస్తుంది. ఆర్ఆర్ఆర్ టైంలో రామ్ చరణ్ కు ఆచార్యలో నటించే ఛాన్స్ దొరకడం అలాంటిదే. ప్రస్తుతం ఎస్ఎస్ఎంబి 29తో బిజీగా ఉన్న మహేష్ బాబు ఇటీవలే సమ్మర్ బ్రేక్ తీసుకున్న సంగతి తెలిసిందే. ఎండలు మరీ ఎక్కువగా ఉండటంతో ఓ నెల ప్యాకప్ చెప్పారు. ఈ క్రమంలో ఎస్ఎస్ఎంబి 30కి రంగం సిద్ధమవుతోందనే పుకారు ఫ్యాన్స్ మధ్య హాట్ టాపిక్ గా మారింది. పెద్ది దర్శకుడు బుచ్చిబాబు మహేష్ కు ఒక లైన్ వినిపించాడని, దాన్ని డెవలప్ చేసే పనిలో ఉన్నాడని వాటి సారాంశం. అయితే ఇది నిజం కాదు. ఎందుకంటే పెద్ది తప్ప వేరే ప్రపంచం లేకుండా ఉంటున్న బుచ్చిబాబు దగ్గర వేరే కథలున్నాయి కానీ ఇప్పటికిప్పుడు వాటి మీద పని చేసే ఉద్దేశంలో తను ఎంత మాత్రం లేడు. పైగా పెద్ది తనకు లైఫ్ టైం ఆపర్చునిటీ. ప్రతి విషయంలో వెయ్యి రెట్లు ఎక్కువ జాగ్రత్త తీసుకుంటున్నాడు. ఇలాంటి పరిస్థితిలో ఇంకో హీరో దగ్గరికి వెళ్లేంత తీరిక ఎంత మాత్రం లేదు. ఇక మహేష్ బాబు సంగతి సరేసరి. ఎస్ఎస్ఎంబి 29 ఎప్పుడు పూర్తవుతుందో తెలియదు. అసలు ఒక భాగమా లేక సీక్వెల్ ఉంటుందా అనే క్లారిటీ లేదు. ఎంతలేదన్నా దీనికి రెండు సంవత్సరాల కనీస సమయం పడుతుంది. అప్పటిదాకా మహేష్ ఎవరిని కలిసే ఆసక్తి కూడా చూపించకపోవచ్చు.

# ట్రెండ్ అవుతున్న వింటేజ్ క్లాసిక్



ఈ మధ్య రీ రిలీజులకు పెద్దగా ఆదరణ దక్కడం లేదు. అందులోనూ ముప్పై నలభై సంవత్సరాల క్రితం వచ్చిన వాటిని మళ్ళీ థియేటర్లలో చూసేందుకు వింటేజ్ ఫ్యాన్స్ ఇష్టపడుతున్నారు కానీ ఇప్పటి మూవీ లవర్స్ కాదు. అందుకే ఆదిత్య 369కు ఎంత మంచి ప్రమోషన్లు చేసినా ఆశించిన స్థాయిలో ఆదరణ దక్కలేదు. ఈ నేపథ్యంలో జగదేకవీరుడు అతిలోకసుందరిని ఎలా రిసీవ్ చేసుకుంటారనే అనుమానం జనంలో లేకపోలేదు. అయితే మెల్లగా ఈ వింటేజ్ క్లాసిక్ బుక్ మై షో ట్రెండ్స్ లోకి వచ్చేసింది. గత ఇరవై నాలుగు గంటల్లో 6 వేల దాకా టికెట్లు అమ్ముడుపోయి శుభ శకునాలనే చూపిస్తోంది. ఇది మరీ పెద్ద నెంబర్ కాకపోయినా రేపటి కొత్త రిలీజులు శ్రీవిష్ణు సింగిల్, సమంత శుభం కన్నా ముందుగా ట్రెండింగ్ లో రావడం విశేషమే. వైజయంతి మూవీస్ చేస్తున్న ప్రమోషన్లు దానికి దోహదం చేస్తున్నాయి. క్రమం తప్పకుండ ప్రోమోలు వదలడం, కౌంట్ డౌన్ పోస్టర్లు, చిరంజీవి రాఘవేంద్రరావుతో సుమ చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ, రీ స్టోరేషన్ కోసం టీమ్ పడిన కష్టాలతో కూడిన ఒక వీడియో ఇవన్నీ ఆసక్తి పెంచేందుకు దోహదం చేశాయి. 1990 మే 9 రిలీజైన జగదేకవీరుడు అతిలోకసుందరి సరిగ్గా ముప్పై అయిదు సంవత్సరాల తర్వాత తిరిగి అదే డేట్ కి విడుదల కానుండటం అభిమానులకు స్పెషల్ మెమరీ అవుతోంది. హైదరాబాద్ లో సుదర్శన్, భ్రమరాంబ తదితర సింగల్ స్క్రీన్ల మార్నింగ్ షోలు ఆల్రెడీ హౌస్ ఫుల్ అయ్యాయి. ప్రసాద్ పిసిఎక్స్ స్క్రీన్లో నాలుగు 3డి షోలు వేస్తే ఫాస్ట్ ఫిల్లింగ్ కనిపిస్తోంది. పలు చోట్ల స్టాండీస్ పెట్టి వాటి ముందు జనాలు ఫోటోలు తీసుకుని జ్ఞాపకంగా ఉంచుకునేలా చేసిన ఏర్పాట్లు సోషల్ మీడియాలో పబ్లిసిటీ తీసుకొస్తున్నాయి.

# క్రేజీ దర్శకుడు హీరో అయితే ఎలా

సౌత్ దర్శకుల్లో రాజమౌళి, సుకుమార్, త్రివిక్రమ్ తర్వాత అంతకన్నా తక్కువో ఎక్కువో స్టార్ డం తెచ్చుకున్న వాళ్లలో లోకేష్ కనగరాజ్ ది మొదటి పేరు. తీస్తున్నది తమిళ సినిమాలే అయినా తెలుగులోనూ విపరీతమైన ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. ఇతని రేంజ్ ఎంతంటే నిన్న కూలి చిన్న టీజర్ వదిలితే అందులో నాగార్జున బ్యాక్ షాట్ గురించి సోషల్ మీడియా మొత్తం మాట్లాడుకునేంత. పాత కథలనే తనదైన స్టైలిష్ టేకింగ్ తో మాస్ ఎలివేషన్లతో పైసా వసూల్ చేయించే ఈ కమర్షియల్ దిగ్గజం త్వరలో హీరో కాబోతున్నాడనే వార్త అభిమానులను ఖంగారు పెడుతోంది. చెన్నై టాక్ చూస్తే నిజమే అనిపిస్తోంది. ధనుష్ తో కెప్టెన్ మిల్లర్ తీసిన అరుణ్ మాతేశ్వరన్ డైరెక్షన్లో హీరోగా లోకేష్ డెబ్యూ జరగనుందని లేటెస్ట్ అప్డేట్. నిజానికి దర్శకులు కథానాయకులుగా మారడం చాలాసార్లు జరిగింది. కానీ సక్సెస్ అయిన వాళ్ళు తక్కువ. మంచి ఊపు మీదున్న టైంలో ఎస్వి కృష్ణారెడ్డి హీరోగా కనిపించాలనే తాపత్రయంతో వరస ఫ్లాపులు చూసి కెరీర్ ని త్వరగా ముగించుకున్నారు. వివి వినాయక్ తో నిర్మాత దిల్ రాజు అలాంటి ప్రయత్నమే చేయబోయి ప్రకటన ఇచ్చాక మానుకున్నారు. గతంలో దాసరి, భాగ్యరాజ్, ఉపేంద్ర లాంటి ఒకరిద్దరు మాత్రమే సక్సెస్ చవిచూశారు. గౌతమ్ మీనన్. సెల్వ రాఘవన్ ఆర్టిస్టులుగా సెటిలయ్యారు. అయినా వందల కోట్ల బడ్జెట్ లతో మల్టీస్టారర్లు తీస్తున్న టైంలో లోకేష్ కి ఇలాంటి ఆలోచన ఎందుకు వచ్చిందోనని ఫాన్స్ ఫీలవుతున్నారు. అయినా తన ప్రయత్నం ఇదే మొదటిసారి కాదు. గతంలో శృతి హాసన్ తో కలిసి ఒక వీడియో సాంగ్ చేశాడు.



# శ్రీవిష్ణుకు షాకిచ్చిన బ్లాక్ బస్టర్ క్లైమాక్స్

కొన్ని సినీ సిత్రాలు విచిత్రంగా ఉంటాయి. అవి సదరు హీరోలు దర్శకులు చెప్పినప్పుడే బయటికి వస్తాయి. అలాంటిదే ఇది. ఎల్లుండి విడుదల కాబోతున్న సింగిల్ ప్రమోషన్లలో భాగంగా శ్రీవిష్ణు మా ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఒక ఆసక్తికరమైన విషయం బయట పడింది. 2021లో రిలీజైన అర్జున ఫాల్గుణ ఎంత పెద్ద డిజాస్టరో తెలిసిందే. ఫన్ ప్లస్ క్రైమ్ థ్రిల్లర్ గా దీని మీద రిలీజ్ కు ముందు మంచి అంచనాలు ఉండేవి. కానీ వాటిని అందుకోలేక బాక్సాఫీస్ దగ్గర తుస్సుమంది. అయితే దీనికి ముందు అనుకున్న ఇంట్రో, క్లైమాక్స్ ఎపిసోడ్స్ వేరు. వాటిని మార్చుకున్నారు. తీరా చూస్తే అవే పెద్ద మైనస్ అయ్యాయి. కట్ చేస్తే తొమ్మిది నెలల తర్వాత ఒక బ్లాక్ బస్టర్ వచ్చింది. ఊహించని విధంగా అర్జున ఫాల్గుణ కోసం ఏదైతే క్లైమాక్స్ అనుకున్నారో దాంట్లో అచ్చంగా అదే ఉంది. ఆ సినిమా సక్సెస్ లో అది చాలా కీలక పాత్ర పోషించింది. దీంతో శ్రీవిష్ణు టీమ్ షాక్ అయ్యింది. అంత క్వాలిటీగా, రిచ్ గా తాము తీయకపోయినా ఆర్టిస్టుల పెర్ఫార్మన్స్ తో తాము తీసింది చాలా బాగా వచ్చిందని, కానీ తర్వాత మార్చుకోవడం దెబ్బ కొట్టిందని వివరించాడు. ఒకవేళ ఒరిజినల్ గా అనుకున్న దానికే కట్టుబడి ఉంటే ఫలితం మారేదేమో అని చెప్పుకొచ్చాడు. పేరు చెప్పలేదు కానీ శ్రీవిష్ణు చెప్పిన క్లూస్ ని బట్టి చూస్తే అది కాంతార అయ్యుండొచ్చు. రెండు కథలు ఒకటే కాకపోయినా హీరో సరైన బాధ్యత లేకుండా బలాదూర్ గా తిరగడమనే పాయింట్ కొంచెం దగ్గరగా ఉంది. బహుశా అర్జున్ ఫాల్గుణకు తొలుత అనుకున్న ట్రీట్ మెంట్ కి ఫాంటసీ టచ్ ఉందేమో. అయినా క్లైమాక్స్ సంగతి పక్కనపెడితే ఈ సినిమాలో మిగిలిన అంశాలు కూడా ఏమంత ప్లస్ కాలేకపోయాయి.



# కబుర్లన్నీ చెప్పి ఇదేంటి అమీర్ సాబ్

ఇటీవలే జరిగిన ఒక ఈవెంట్ లో అమీర్ ఖాన్ మాట్లాడుతూ థియేటర్ ఓటిటి మధ్య ఇప్పుడున్న గ్యాప్ సరిపోదని నాలుగు వారాల నుంచి రెండు నెలల మధ్యలోనే కొత్త సినిమాలు డిజిటల్ లో వస్తుంటే ప్రేక్షకులు టికెట్లు ఎందుకు కొంటారని చెప్పుకొచ్చాడు. అంతేకాదు ఇండియాలో స్క్రీన్లు చాలట్లేదు, జపాన్ చైనా తరహాలో వేలాదిగా కొత్తవి అందుబాటులోకి రావాలని అన్నాడు. వినడానికి ఇదంతా బాగానే ఉంది కదా, అమీర్ కున్న దూరాలోచనకు అందరూ సూపర్ అనుకున్నారు. తీరా చూస్తే కబుర్లు చెప్పేందుకు తప్ప పాటించడానికి కాదనేలా ఉంది అమీర్ ఖాన్ వ్యవహారం. బాలీవుడ్ మీడియా అదే చెబుతోంది.జూన్ 20 విడుదల కాబోతున్న సితారే జమీన్ పర్ ఎనిమిది వారాల థియేటర్ రన్ తర్వాత యూట్యూబ్ లో పే పర్ వ్యూ మోడల్ లో రిలీజ్ చేసే ఆలోచన సీరియస్ గా చేస్తున్నారట. అంటే ఓటిటిలకు అమ్మకుండా తనకే ప్రతి రూపాయి వచ్చే ప్లాన్ అన్నమాట. ఇది చాలా పెద్ద రిస్క్. ఎందుకంటే కట్టుదిట్టమైన ఫైర్ వాల్స్ ఉండే అంతర్జాతీయ ఓటిటిలనే వదలకుండా పైరసీ చేస్తున్నారు చోరులు. అలాంటిది యూట్యూబ్ లో పెడితే ఊరుకుంటారా. అసలే ఇది హెచ్డి పైరసీ ట్రెండ్. రిలీజైన రోజు సాయంత్రానికే అదిరిపోయే ప్రింట్లు ఆన్ లైన్ లో ప్రత్యక్షం అవుతున్నాయి. అలాంటప్పుడు అమీర్ ది తెలివైన ఆలోచన కాదు. సరే ఆయన సినిమా ఆయన ఇష్టం అనుకున్నా మరి వేవ్స్ 2025లో అన్నేసి నీతిబోధలు చేయడం ఎందుకనేదే అసలు ప్రశ్న. లాల్ సింగ్ చద్దాతో బాగా డిస్టర్బ్ అయిన అమీర్ ఖాన్ ఆశలన్నీ సితారే జమీన్ పర్ మీదే ఉన్నాయి. ఆర్ఎస్ ప్రసన్న దర్శకత్వంలో రూపొందిన ఈ ఎమోషనల్ యూత్ డ్రామా తనకు పూర్వ వైభవం తెస్తుందని నమ్ముతున్నాడు.



# బన్నీకు ముందు డబుల్ సాహసం చేసిన హీరోలు



అట్లీ దర్శకత్వంలో రూపొందబోయే అల్లు అర్జున్ 22 షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. స్క్రిప్ట్ లాక్ చేసిన టీమ్ ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. పాత్రల ప్రాధాన్యతకు అనుగుణంగా చిన్నా పెద్ద కలిపి ఇందులో అయిదుగురు హీరోయిన్లు ఉంటారనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఇదిలా ఉండగా ఈ ప్యాన్ ఇండియా మూవీలో బన్నీ హీరో, విలన్ గా డ్యూయల్ రోల్ చేయబోతున్నట్టు వస్తున్న అప్డేట్ అభిమానులను ఎగ్జైట్ చేస్తోంది. అధికారికంగా ప్రకటించలేదు కానీ గతంలోనే వచ్చిన ఈ లీక్ దాదాపు నిజమే. అయితే ఇలా నాయకుడు, ప్రతినాయకుడిగా రెండు క్యారెక్టర్స్ పోషించే సాహసం చేసిన హీరోలు గతంలోనూ ఉన్నారు.మచ్చుకు కొన్ని చూద్దాం. సూర్య (24), కమల్ హాసన్ (అభయ్), కృష్ణ (మానవుడు దానవుడు), బాలకృష్ణ (సుల్తాన్), రజనీకాంత్ (రోబో), విజయ్ (గోట్ గ్రేటెస్ట్ అఫ్ ఆల్ టైం), ఫ్యాన్ (షారుఖ్ ఖాన్), శోభన్ బాబు (జగన్) ముఖ్యమైన ఉదాహరణలుగా చెప్పుకొచ్చు. ఇవన్నీ డబుల్ ఫోటో సినిమాలే. కాకపోతే అధిక శాతం బ్లాక్ బస్టర్లు కాలేకపోయాయి. రోబో ఒకటే ఇండస్ట్రీ రికార్డులు సృష్టించింది. ఇప్పుడు మళ్ళీ అల్లు అర్జున్ ఈ లిస్టులో చేరబోతున్నాడు. సై ఫై జానర్ కాబట్టి విలన్ పాత్ర డిజైనింగ్ ఊహకందని రీతిలో ఉంటుందని తెలిసింది. గెటప్ షాక్ ఇచ్చేలా దర్శకుడు అట్లీ డిజైన్ చేసుకున్న తీరు అబ్బురపరచడం ఖాయమంటున్నారు. 2026 విడుదలను లక్ష్యంగా పెట్టుకున్న ఈ విజువల్ గ్రాండియర్ కోసం అంతర్జాతీయ సంస్థలు పని చేస్తున్నాయి. సూపర్ హీరో కాన్సెప్ట్ ని అంతర్లీనంగా తీసుకుని దానికి తనదైన శైలి కమర్షియల్ ట్రీట్ మెంట్ ఇవ్వబోతున్నాడు అట్లీ. పుష్ప తర్వాత చేస్తున్న సినిమా కావడంతో బన్నీ సైతం చాలా జాగ్రత్తగా అన్ని విషయాలు దగ్గరుండి చూసుకుంటున్నాడు. ఇంకో మెయిన్ విలన్ ఎవరనేది మాత్రం గుట్టుగా ఉంచుతున్నారు. విదేశీ నటుడిని తీసుకునే ప్లాన్ లో ఉన్నారట. అదెవరనేది తెలియాల్సి ఉంది. ఐకాన్ స్టార్ కెరీర్ లోనే అత్యంత భారీ బడ్జెట్ తో సన్ పిక్చర్స్ దీన్ని నిర్మించబోతోంది. 500 కోట్ల పైమాటేనని టాక్.

# టెర్రరిజం, దేశ భక్తి నేపథ్యంలో..

రవి ప్రకాష్ రెడ్డి, సమీర్ దత్త, టేస్టీ తేజ, పల్లవి, రమ్యా రెడ్డి తదితరులు ప్రధాన పాత్రల్లో పాల్యం శేష మ్మ, బసిరెడ్డి సమర్పణలో అరుణ కు మారి ఫిలింస్ బ్యానర్‌పై రూపొందిన చిత్రం '6 జర్నీ'. బసీర్ ఆలూరి దర్శకత్వంలో పాల్యం రవి ప్రకాష్ రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని శుక్రవారం రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బసీర్ మాట్లాడుతూ "ఈ సినిమా ఆరుగురి జీవిత ప్రయాణం. గోవా ట్రిప్‌ను ఎంజాయ్ చేసి సూసై డ్ చేసుకోవాలని అనుకునే ఓ బ్యాచ్ కథే '6జర్నీ'. అలాంటి వా రి ప్రయాణంలో ఎదురైన పరిస్థితులు ఏంటి? అన్నది ఈ సిని మా కథ. సమీర్, పల్లవి జంట అద్భుతంగా నటించింది. కొత్త అబ్బాయి విలన్‌గా అభిరాం చక్కగా నటించారు. కొత్త మ్యూజిక్ డైరెక్టర్, కొత్త ఫైట్ మాస్టర్ ఇలా అందరూ అద్భుతంగా పని చే శారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎస్ సింహా మంచి పాటల్ని ఇచ్చా రు. మంచి సంగీతం, మంచి పాటలు ఉన్నాయి. క్లైమాక్స్ చాలా గొప్పగా ఉంటుంది. శ్రీరాముడు పుట్టిన నేల మీద ఉగ్రవాదులు దాడి చేయడం ఏంటి? ఇక్కడ యువత ఎలా పోరాడాలి అంటూ దేశ భక్తిని రేకెత్తించేలా క్లైమాక్స్‌ను అద్భుతంగా తెరకెక్కించాం. ప్రస్తుతం ఉన్న పరిస్థితులకు తగ్గట్టుగా క్లైమాక్స్ ఉంటుంది. సినిమా పూర్తిగా టెర్రరిజం మీదే నడుస్తుంది"అని అన్నారు.

Printed, Published and Owned by Ganji. Venkatesh, Printed At Nandini Printers H.NO . 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 And Published From H.NO. 3-29, Mankhal Village, Tukkuguda Muncipalty, Maheswaram Mandal, Ranga Reddy District - Pin Code 501359 Telangana State. Editor Ganji Venkatesh RNI NO: TELTEL/2022/85167, Phone NO 9705347284, Email ID:Padmakranthi2022@gmail.com.